తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-29- ఏప్రిల్ 2025 | సంపుటి : 2 | సంచిక : 338 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# కేసీఆర్‌కు ప్రజల్లో నమ్మకం లేదు, భవిష్యత్ కాంగ్రెస్‌దే

ఎల్కతుర్తి సభలో కేసీఆర్‌కు తడబాటు.. పసలేని ప్రసంగం – సీఎం విమర్శ

భారాసపై ప్రజల విశ్వాసం కోల్పోయింది, అసెంబ్లీలో పిల్లగాళ్లే మాట్లాడుతున్నారు

ఆపరేషన్ కగార్‌పై జానారెడ్డి, కేకేలతో చర్చ



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

"ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాటల్లో అభద్రత కనిపించింది. ఆయన ప్రసంగంలో పస లేదు. స్పష్టత లేదు. కాంగ్రెస్‌పై తన అక్కసునంతా వెళ్లగక్కారు. కేసీఆర్ ఏం చేసినా.. భారాసను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అసెంబ్లీలో భారాస తరఫున మాట్లాడుతున్నది పిల్లగాళ్లని ఆయనే చెప్పేశారు. మరి వారినెందుకు అసెంబ్లీకి పంపిస్తున్నారు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి ఇంటి వద్ద సోమవారం సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "ఆపరేషన్ కగార్‌పై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు.. ఈరోజు జానారెడ్డి, కేకేలతో చర్చించాం. ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి. మా పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత.. ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం. రాహుల్ గాంధీకి, నాకు మధ్య అంతరం(గ్యాప్) ఉందనడం అవాస్తవం. మా మధ్య మంచి సంబంధాలున్నాయి. మా ఇద్దరికీ ఉన్న సంబంధాన్ని బయట ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదు. ఎవర్నీ నమ్మించాల్సిన అవసరం అస్సల్లేదు. కేసీఆర్, మోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి. ప్రపంచంలో ఆమెను మించిన యోధురాలు లేరు. ఒక దేశాన్ని ఓడించిన ఘనత ఇందిరా గాంధీదే.

మిగతా 2లో..




# కిషోర బాలికలకు చిరుధాన్యాల పట్టీలు

- చిరుధాన్యాలు, పల్లిపట్టీలు 14-18 ఏళ్ల బాలికలకు – పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- ఆహార సరఫరాలో రుచి, నాణ్యత పెంపు కోసం నిపుణుల కమిటీ
- ఎనిమియా తగ్గించేందుకు మహిళలపై అవగాహన, ప్రత్యేక చర్యలు
- తొలుత భూపాలపల్లి, ఆసిఫాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్ అమలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

మహిళా శిశు సంక్షేమ శాఖలోని అన్ని విభాగాలు నిర్దిష్ట గడువును నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మంత్రి సీతక్క ) అన్నారు. చివరి నిమిషంలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల శాఖకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని చెప్పారు. అందువల్ల ఎప్పటికప్పుడు బడ్జెట్‌ను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకోసారి పూర్తిస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తాం. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తిచేసే దిశలో పనిచేయాలి. ఆరేండ్లలోపు చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా చూడాలి. ఈ ఏడాది అంగన్‌వాడీల్లో హాజరు శాతం పెరగాలి.

మిగతా 2లో..

# కాంగ్రెస్ శ్రేణులతో భారీ ర్యాలీ

**ఉమ్మడి నల్లగొండ, (తెలంగాణ ముచ్చట్లు):**

ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను ఈ నాలుగేళ్లలోనే పూర్తిచేసి తీరుతామని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో రూ.46.25 కోట్ల అంచనావ్యయంతో చేపడుతున్న బక్కతాయికుంట, పొనుగోడు, నర్సింగ్‌భట్ల ఎత్తిపోతల పథకాలకు, రూ.36కోట్ల అంచనావ్యయంతో నిర్మించతలపెట్టిన కలెక్టరేట్ అదనపు బ్లాక్ నిర్మాణానికి సోమవారం రోడ్లు, భవనాలశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో..



## బీఆర్ఎస్ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై
# కోమటిరెడ్డి మండిపాటు

- కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- తెలంగాణకు కాంగ్రెస్ విలన్?
- సోనియా గాంధీ కాలు మొక్కిన కేసీఆర్
- దళితులకు మోసం, ధరణి మోసాలు బయటపెడతాం - కోమటిరెడ్డి హెచ్చరిక
- మేం అనుకుంటే కేసీఆర్ కంటే డబుల్ మీటింగ్ పెడతాం
- నల్లగొండ కలెక్టరేట్‌లో శంకుస్థాపన



2లో..

# మందుపాతరల ముప్పుతో ఉన్నా.. కూంబింగ్ ముందుకు

కర్రెగుట్టల్లో ఏడో రోజు మావోయిస్టుల ఆహుతి ప్రాంతాల్లో ఆపరేషన్

150 మందుపాతరలు గుర్తింపు, నిర్వీర్యం

అధునాతన టెక్నాలజీతో ఐఈడీలను గుర్తిస్తున్న భద్రతా బలగాలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు అడుగడుగునా మందుపాతరల గండం ఎదురవుతున్నా ఏడో రోజు సోమవారం కూంబింగ్ కొనసాగించాయి. మావోయిస్టులు తమ కీలకమైన స్థావరాల సమీపంలో రక్షణగా ఏర్పాటు చేసిన బాంబులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 150 ఐఈడీలను బలగాలు గుర్తించాయి. సోమవారం సాయంత్రం నడిపల్లిగల్లం నడుమ అరగంట పాటు కాల్పులు జరిగినట్లుగా అక్కడి ప్రజలు చెబుతున్నారు. ములుగు జిల్లాలోని పామునూరు సమీప ఒక్కడుగు గుట్ట, ముకునూరు ఎత్తుగుట్ట, దేవునిగుట్టల బాటల్లో

మిగతా 2లో..





## కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై
# చర్చకు వస్తారా?

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ విధ్వంసానికి మొదటి ముద్దాయి కేసీఆర్ అని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అబద్ధాలు చెప్పడంలో దిట్టని, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలపై చర్చకు వస్తారా? అని మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. ఎల్కతుర్తి సభలో సెటైర్లు వేశారు మహేశ్వర్ రెడ్డి. కొండంత రాగం తీసి.. దిక్కుమాలని పాట పాడినట్లు ఉంది బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని ఎద్దేవా చేశారు. 'తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజ్ ఇవ్వలేదని నిందించారు. బీబీ నగర్ లో ఎయిమ్స్ ఎవరిచ్చారు?, కేసీఆర్ పదేళ్లపాటు మావోయిస్టులను చర్చలకు ఎందుకు పిలవలేదు. అధికారం పోయాక మావోయిస్టులు గుర్తుకు వచ్చారా?, మావోయిస్టులను వెనకేసుకురావడాన్ని ప్రజలు గమనిస్తున్నారు.

మిగతా 2లో..

# పీవోకేలో ఉగ్రవాదులను తరలిస్తున్న పాకిస్థాన్ సైన్యం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి.

మిగతా 2లో..



# గ్రూప్-1 పిటిషనర్లపై హైకోర్ట్ ఆగ్రహం..

తప్పుడు పత్రాలతో కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం


రూ.20 వేల జరిమానా విధించిన ధర్మాసనం

న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేసిన అభ్యర్థులపై సీరియస్

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రూప్ 1 రీవాల్యుయేషన్ మార్కులను పారదర్శకంగా వెల్లడించాలని కోరిన పిటిషనర్లకు తెలంగాణ హైకోర్టు జరిమానా విధించింది. తప్పుడు పత్రాలతో కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్ 1 పరీక్షల వ్యవహారాన్ని తొలి నుంచీ వివాదాలు చుట్టుముట్టిన సంగతి తెలిసిందే. ఈ అంశం హైకోర్టు, సుప్రీంకోర్టులకు సైతం చేరింది.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కేసీఆర్‌కు ప్రజల్లో నమ్మకం లేదు, భవిష్యత్ కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

"ఆపరేషన్ కగార్‌పై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు.. ఈరోజు జానారెడ్డి, కేకేలతో చర్చించాం. ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి. మా పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత.. ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం. రాహుల్ గాంధీకి, నాకు మధ్య అంతరం(గ్యాప్) ఉందనడం అవాస్తవం. మా మధ్య మంచి సంబంధాలున్నాయి. మా ఇద్దరికీ ఉన్న సంబంధాన్ని బయట ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదు. ఎవర్నీ నమ్మించాల్సిన అవసరం అస్సల్లేదు. కేసీఆర్, మోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి. ప్రపంచంలో ఆమెను మించిన యోధురాలు లేరు. ఒక దేశాన్ని ఓడించిన ఘనత ఇందిరా గాంధీదే.

మా ప్రభుత్వ పాలనపై ఇప్పటినుంచే చర్చ ఎందుకుంటుంది? ఎన్నికలకు ముందు చివరి ఆరు నెలలూ చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కొత్త పథకాలు తీసుకొచ్చాం. తొలి ఏడాదిన్నర ప్రణాళికల రూపకల్పనకే సమయం పోయింది. ఇప్పుడు వాటిని సమీక్షిస్తున్నాం. పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

**ఓపికగా ఉంటే పదవులు వస్తాయి**

మరో 20 ఏళ్లు నేను రాజకీయాల్లో ఉంటా. గత ప్రభుత్వంలో తప్పు చేసినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ వస్తోంది. కానీ, నేను అలా అరెస్టు చేయలేను. అన్నీ చట్టప్రకారమే జరుగుతాయి. నేను కేసీఆర్ లాగా చట్టాన్ని అతిక్రమించను. చట్టప్రకారమే నడుచుకుంటా. నేను ఒక మాట ఇచ్చానంటే.. అంతే అంకితభావంతో పనిచేస్తా. ఇచ్చిన మాటను అమలుచేసి తీరుతా. అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పా. ఇప్పించాను. నన్ను నమ్ముకున్న వాళ్లను మోసం చేయను. రేవంత్ చెప్పింది చేస్తాడనే నమ్మకం ప్రజలకు కలిగేలా చేస్తా. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నష్టపోతారు.

**కొందరు ఎమ్మెల్యేలు టైమ్‌పాస్ చేస్తున్నారు**

చేసిన పనుల గురించి చెప్పుకోవడంలో కొంత వెనుకబడ్డాం. దీన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరముంది. ఎమ్మెల్యేలను నియోజకవర్గాల్లో పర్యటించాలని చెబితే... కొందరు హైదరాబాద్‌లోనే టైమ్‌పాస్ చేస్తున్నారు. ఎమ్మెల్యే అయ్యాక.. మనోడు, మందోడు అని ఉండదు. ఎమ్మెల్యేలందరూ కచ్చితంగా ప్రజల్లోకి వెళ్లాల్సిందే. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అలా వెళ్తేనే పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరతాయి. అధికారుల విషయంలో ప్రభుత్వం కొంత సంయమనం పాటించాల్సిన అవసరముంది. అందరూ మనవాళ్లు ఉండరు. ఉన్నవాళ్లను మన వాళ్లుగా మార్చుకోవాలి. భూభారతి, ధరణి అంశాలపై నవీన్ మిత్తల్‌కు పూర్తి అవగాహన ఉంది. అలాంటి వారిని మార్చలేం. కొంతమంది అధికారులు సర్వీస్ చేయమంటే.. సంపాదన మార్గంలో ఉన్నారు. అలాంటివారిని కాకుండా.. సబ్జెక్ట్, కమిట్‌మెంట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నాం. కొందరు అధికారుల గురించి నాకు తెలుసు. కానీ మరో ఆప్షన్ లేక వారిని కొనసాగించాల్సి వస్తోంది. ఉన్నపళంగా తొలగిస్తే.. పాత విషయాలన్నీ తెలిసేదెలా?" అని ముఖ్యమంత్రి అన్నారు.

# కిశోర బాలికలకు చిరుధాన్యాల పట్టీలు

(మొదటి పేజీ తరువాయి)




పిల్లల హాజరును మరో 30 శాతం పెంచేలా పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. తద్వారా చిన్నారుల్లో పోషకార లోపాన్ని నివారించవచ్చు. పిల్లల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలి. దత్తత ఇచ్చేలోపు, పిల్లల సంరక్షణ బాధ్యతను స్వీకరించేందుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలి. ఆ చిన్నారుల సంరక్షణ బాధ్యతలు చూసుకునే వారికి ఆర్థిక చేయూతనిచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నాం.

దివ్యాంగులకు అత్యవసరమైన సర్జరీలను ప్రభుత్వమే చేయిస్తుంది. అనుగుణంగా దివ్యాంగులను గుర్తించి అధికారులు సర్జరీ ఏర్పాట్లు చేయాలి. రాజీవ్ యువ వికాస పథకంలో దివ్యాంగులకు 5 శాతం కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని వారు వినియోగించుకోవాలి. కుటుంబంలో దివ్యాంగులుంటే వారి పేరు మీదే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే అంశం పరిశీలనలో ఉంది.

అంగన్‌వాడీలకు సరఫరా అయ్యే ఆహార నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు, మరింత రుచి కరంగా మార్చేందుకు ఎన్ఐఎన్, యూనిసెఫ్ వంటి సంస్థలు, నిపుణులతో కమిటీ వేశాం. వారి నివేదిక ఆధారంగా అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న ఆహారంలో మార్పులు, చేర్పులు చేస్తాం. 14 నుంచి 18 ఏండ్లలోపు కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పల్లిపట్టీ, చిరుధాన్యాల పట్టీలు అందిస్తాం. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేస్తాం.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 23 మొబైల్ అంగన్‌వాడీ వాహనాలను ఏర్పాటు చేసి అర్హులందరికీ గుడ్లు, ఆహారం చేస్తున్నాం. టేక్ హోమ్ రేషన్ ఇవ్వడమే కాకుండా.. ఆ ఇండ్లను అంగన్‌వాడీ సిబ్బంది సందర్శించి సరఫరా చేసిన ఆహారాన్ని తీసుకుంటున్నారా లేదా పరిశీలించి అవగాహన పెంచాలి. కిశోర బాలికలతో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. వారికి కూడా పౌష్టికాహారంపై అవగాహన పెంచాలి. మహిళల్లో ఎనిమియాను ఐదు శాతం తగ్గించేల చర్యలు చేపట్టాలి. ప్రతి మండలంలో కనీసం 3 అంగన్‌వాడీ భవనాలను నిర్మించే పనులను ప్రారంభించాలి.' అని అధికారులకు సూచించారు.

# బీఆర్ఎస్ సభలో కేసీఆర్ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి మండిపాటు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అసలు కేసీఆర్ ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదంటూ విమర్శించారు కోమటిరెడ్డి. నల్లగొండ కలెక్టరేట్ లో అదనపు బ్లాక్ కు శంకుస్థాపన చేసిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

దీనిలో భాగంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని కేసీఆర్ అంటున్నాడు. సోనియా గాంధీ కాలు మొక్కాడు కేసీఆర్. కేసీఆర్ నీది నోరా.. మోరీనా?, తెలంగాణను మొత్తం దోచుకుతిన్నారు. దళితుడిని సీఎం చేస్తానని , మూడెకరాలు ఇస్తానని మోసం చేయలేదా ?, కేసీఆర్.. మేం అనుకుంటే నల్లగొండలో నీకంటే డబుల్ మీటింగ్ పెడతాం. ధరణితో ఏం మోసాలు చేశారో అన్నీ బయటపడతాయి' అని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు.

**తెలంగాణ.. బీఆర్ఎస్ సొంతం కాదు**

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ సొంతం కాదనే విషయం తెలుసుకుంటే మంచిదని విమర్శించారు. 'వందల కోట్ల అవినీతి సొమ్ముతో మీటింగ్ పెట్టుకున్నారు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులు ఉత్తమ్, కొమటిరెడ్డి సీఎం స్థాయి నాయకులు. ప్రజలు కేసీఆర్ ను కోరుకుంటున్నారంటే నవ్వుకుంటున్నారు. నిన్ను ఫాంహౌస్ కు ఎందుకు పరిమితం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు. దమ్ముంటే రా.మీరు నిర్మించిన ప్రాజెక్టులు ఎందుకు కూలిపోతున్నాయి.

కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు ఎలా దోచుకున్నారో లెక్కలు చెప్తున్నాం. వెయ్యి జన్మలు ఎత్తినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు. బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. పదేళ్లలో జిల్లా అభివృద్ధి కుంటుపడింది. జిల్లాలో రైతులకు మేలు జరగలేదు. బీఆర్ఎస్ ఆగం చేసిన తెలంగాణను కాంగ్రెస్ గాడిలో పెడుతోంది. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో మంచి జరుగుతుంది. కానీ బీఆర్ఎస్ కుటుంబ పాలనలో కాదు. తెలంగాణ కోసం కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవిని త్యాగం చేశారు. నిన్నా మొన్న రాజకీయాల్లోకి వచ్చినోళ్లు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురించి ఏదేదో మాట్లాడుతున్నారు' అని మండిపడ్డారు.

# మందుపాతరల ముప్పుతో ఉన్నా.. కూంబింగ్ ముందుకు

(మొదటి పేజీ తరువాయి)

ఐఈడీలను భద్రతా బలగాలు గుర్తించాయి. పదుల మీటర్ల దూరంలో తీగలు అమర్చి మందుపాతరలను పాతిపెట్టిన వాటిని చాకచక్యంగా నిర్వీర్యం చేశారు. ఇదే క్రమంలో కొత్త పంథాలో మావోయిస్టులు బీరు సీసాల్లో ఏర్పాటు చేసిన బాంబులు సైతం తాజాగా వెలుగులోకి వచ్చాయి. బీజాపుర్ జిల్లా నైరుతి దిశ అడవుల్లో నాలుగు రోజుల క్రితం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ముగ్గురు మహిళా మావోయిస్టుల వివరాలను పోలీసులు సోమవారం వెల్లడించారు. వీరు పీఎల్‌జీఏ నంబర్ 1 బెటాలియన్‌కు చెందిన సభ్యులు శాంతి, హుంగీ, సింటీలుగా వెల్లడించారు. అడవులను జల్లెడ పడుతున్న బృందాలు అక్కడి గిరిజనులను చక్రబంధం చేసినట్లు తెలుస్తోంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లోని పెనుగోలు, పాముునూరు, చెలిమల ప్రాంతాల్లో ఆంక్షలు విధించినట్లు సమాచారం. ప్రతి వారం మండల కేంద్రాల్లోని వార సంతలకొచ్చి నిత్యావసరాలు కొనుగోలు చేసుకునే ఆదివాసీలు బయటికి రాకుండా ఇళ్లలోనే ఉండిపోయారు.

**24 మంది మావోయిస్టుల లొంగుబాటు..**

మావోయిస్టులపై ఆపరేషన్ తీవ్రతరమవుతున్న నేపథ్యంలో బీజాపుర్ జిల్లాలో సోమవారం పోలీసు అధికారుల ఎదుట 24 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 14 మందిపై రూ.24.50 లక్షల మేర రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 11 మంది మహిళలు ఉన్నారు. అత్యవసర పరిహారం కింద ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులను అందజేశారు.

**24 వేల మంది బలగాలతో..**

ఛత్తీస్‌గఢ్‌తోపాటు కేంద్ర పారామిలిటరీకి చెందిన 24 వేల మందికి పైగా సిబ్బంది ప్రత్యక్షం, పరోక్షంగా ఆ మిషన్‌లో పాల్గొంటున్నట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ), తెలంగాణ స్టేట్ కమిటీ (టీఎస్‌సీ), పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ), బెటాలియన్ నంబర్ 1, సీఆర్‌సీ కంపెనీలు ఈ ప్రాంతంలో మావోయిస్టుల నియంత్రణే లక్ష్యంగా పని చేస్తున్నాయి.



# కాంగ్రెస్ శ్రేణులతో భారీ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రుల పర్యటన సందర్భంగా నల్లగొండలో మంత్రులతో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రులిద్దరూ ఓపెన్‌టాప్ కారులో నిలబడి ర్యాలీలో పాల్గొని కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఇదే సభా వేదికనుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ జిల్లాలో అయిదుగురు లబ్ధిదారులకు సోమవారం రూ.లక్ష విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమాల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్‌రెడ్డి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రాజ్‌కుమార్, ప్రాజెక్టుల సీఈ అజయ్‌కుమార్, ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి, జవహర్, డీఆర్‌వో అశోక్‌రెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణఅధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వంగూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

**భారీ ప్రదర్శనగా మంత్రుల ర్యాలీ**

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనల నిమిత్తం జిల్లాకేంద్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటన నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ శ్రేణులు నల్లగొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. కార్లతోపాటు, బైక్‌లతో ఈ ర్యాలీలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. మంత్రులిద్దరూ ఓపెన్‌టాప్ కారులో నిలబడి కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహపరుస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. జైకాంగ్రెస్, జై కోమటిరెడ్డి నినాదాలతో ర్యాలీలో కార్యకర్తలు సందడి చేశారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, అబ్బగోని రమేష్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

**నాలుగేళ్లలో ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తాం :ఉత్తమ్**

బీఆర్ఎస్ హయాంలో పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని కూడా ఈ టర్మ్‌లోనే పూర్తిచేస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. అక్కడ జరిగిన ప్రమాదంతో తాత్కాలిక ఇబ్బందులను అధిగమించి పనులు చేయిస్తామన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో 80ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిండి ఎత్తిపోతలకు నీరందించే ఏదులడిండి పథకానికి రూ.1800కోట్లతో తమ ప్రభుత్వం టెండర్లు పిలిచి, పనులు చేపడుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ఎత్తిపోతల పథకాలన్నింటికీ నిధులు మంజూరు చేసి పనులు చేపడతామన్నారు. మంత్రి వెంకటరెడ్డి అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారని, మరో పర్యాయం ఎంపీగానూ పనిచేశారన్నారు. ఆయన నల్లగొండ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రూ.700కోట్లతో రింగ్‌రోడ్డు, లతీఫ్‌సాబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టలపైకి ఘాట్‌రోడ్లు, రోప్‌వేల నిర్మాణాల పనులు శరవేగంగా సాగుతుండడం గమనించానని తెలిపారు. మంత్రి వెంకటరెడ్డి కోరిక మేరకు ఏఎమ్మార్పీ హైలెవల్ కాల్వ లైనింగ్ ప్రాజెక్టుకు రూ.442 కోట్ల నిధులు మంజూరుచేశామని, త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గుండ్లపల్లిఉదయసముద్రం పథకానికి రూ.92 కోట్లు, భీమసముద్రంచర్లపల్లి ప్రాజెక్టుకు రూ.26కోట్ల నిధులతో ప్రతిపాదనలు అందాయని, వాటిని కూడా మంజూరుచేస్తామని ప్రకటించారు. బునాదిగానికాల్వ, పిలాయిపల్లి కాల్వ, ధర్మారెడ్డిపల్లి కాల్వలకు రూ.500కోట్లతో నిధులు మంజూరు చేయగా, పనులు మొదలయ్యాయని, ఎమ్మెల్యేలు రోజూ పనులు పర్యవేక్షించి సకాలంలో పూర్తయ్యేలా సమీక్షలు చేయాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. రైతులంతా ప్రాజెక్టులు, కాల్వలకు భూసేకరణ విషయంలో సహకరించాలని మంత్రి కోరారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కోరిన మేరకు శివన్నగూడెం నుంచి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు లిఫ్టు చేపట్టాలనే ప్రతిపాదనలకు నిధులిస్తామని, త్వరలో టెండర్లు చేపడతామని ప్రకటించారు. నకిరేకల్ ఎమ్మెల్యే కోరిక మేరకు అయిటిపాముల ఎత్తిపోతల పథకం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచనమేరకు దున్నపోతుల గండి సహా నాలుగు ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి కోరిన ప్రకారం న నెల్లికల్లు ఎత్తిపోతల పథకం మొదటిదశను వేగంగా పూర్తిచేస్తామన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ కోరికమేరకు పెండ్లిపాకల రిజర్వాయర్ పూర్తిచేస్తామని, కాచవరం, చింత్రియాల, రాములోరి బండ లిఫ్టులు పూర్తిచేస్తామని ప్రకటించారు. తుంగుతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు 15 ప్రాజెక్టులకు నిధులివ్వాలని కోరారని, వాటన్నింటినీ ఆమోదించి నిధులిప్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా దేవాదుల మూడోదశ నుంచి తుంగతుర్తికి నీళ్లిచ్చే రూ. 1000కోట్ల పథకాన్ని ఆమోదిస్తామన్నారు. బీర్ల అయిలయ్య పేర్కొన్న ప్రకారం గంధమల్ల రిజర్వాయర్ మంజూరుచేసి పనులు పూర్తిచేయిస్తామన్నారు. అదేవిధంగా ఎంపీ కిరణ్‌రెడ్డి ప్రతిపాదించిన రాచకాల్వ లైనింగ్ చేపడతామని, శాలిగౌరారం కాల్వల లైనింగ్, కేతిరెడ్డిపల్లి కాల్వ లైనింగ్ చేపడతామన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సహకారంతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తున్నామని, తాము పదవులు అలంకారం కోసం చేయడం లేదని, మంత్రులుగా బాధ్యతలు తీసుకున్న క్షణం నుంచి ప్రతిరోజూ 24గంటలు కష్టపడి పనిచేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా ప్రగతికి ఎవరు ఏమూల నుంచి వచ్చినా తాము పనులు చేస్తామని, వారి సమస్యలు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.



# గ్రూప్-1 పిటిషనర్లపై హైకోర్ట్ ఆగ్రహం..

(మొదటి పేజీ తరువాయి)

చివరికి అన్ని అడ్డంకులు తొలగిపోయాయని అనుకున్న తరుణంలో రివాల్యుయేషన్ మార్కుల గురించి 19 మంది అభ్యర్థులు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు.

దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ఇవాళ (సోమవారం) విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ జారీ చేసిన మార్కుల మెమోకు, వెబ్‌సైట్ లో ఉన్న మార్కులకు తేడాలున్నాయని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. రీవాల్యుయేషన్ చేపట్టి మార్కులను టీజీపీఎస్సీ పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. దీనికి సంబంధించిన పత్రాలను కోర్టు ముందు ఉంచారు.

అయితే పిటిషనర్లు తప్పుడు ధ్రువపత్రాలు చూపించారంటూ టీజీపీఎస్సీ న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అందుకు సంబంధించిన ఆధారాలను సైతం కోర్టులో ప్రవేశపెట్టారు. ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ప్రాథమిక వివరాలను పరిశీలించి అభ్యర్థులు తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని నిర్ధారించారు. ఈ మేరకు వాస్తవాలను దాచి కోర్టును తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. పిటిషనర్లపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని జ్యూడిషియల్ రిజిస్ట్రార్‌ను జస్టిస్ నగేశ్ ఆదేశించారు. అలాగే వారికి రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

### కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై

# చర్చకు వస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

గతంలో చర్చలు జరిపినప్పుడు ఏమైంది?, మావోయిస్టులకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదు' అని ధ్వజమెత్తారు.

**కేసీఆర్ పగటి కలలు కంటున్నారు..**

మళ్లీ అధికారంలోకి వస్తామని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. బీఆర్ఎస్ మోడల్ అంటే విధ్వంస పాలన.. ఫెయిల్యూర్ పాలన.. కుటుంబ పాలన. కుటుంబ పాలనకు కాలం చెల్లింది. తెలంగాణకు అప్పుల ఊబిలోకి కేసీఆర్ నెట్టారు. కాళేశ్వరం కట్టి తెలంగాణ ప్రజల మీద భారం మోపారు. మొసలి కన్నీరు కార్చిన కేసీఆర్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు' అని మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు.

### పీవోకేలో ఉగ్రవాదులను

# తరలిస్తున్న పాకిస్థాన్ సైన్యం

(మొదటి పేజీ తరువాయి)

వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి.

పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేటి పర్యటన వివరాలు

**సిరిసిల్ల, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వ విప్ మరియు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మంగళవారం రోజున సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఉదయం 9:00 గంటలకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ నుండి గాంధీ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు "జై బాపు, జై భీమ్, జై సోవిధాన్" ర్యాలీలో పాల్గొననున్నారు. ఈ ర్యాలీ రాజ్యాంగ పరిరక్షణ కోసం నిర్వహించబడుతుంది.

తర్వాత ఉదయం 10:30 గంటలకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో లహరి గ్రాండ్ హోటల్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో పార్టీ కార్యక్రమాలపై చర్చలు జరగనున్నాయి.

మధ్యాహ్నం 01:30 నిమిషాలకు ఆయన రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు, ఇందులో జిల్లా అభివృద్ధి సంబంధిత అంశాలు చర్చించబడతాయి.

సాయంత్రం 04:00 గంటకు, కోనరావుపేట మండల నిజామాబాద్ గ్రామంలో రైతు వేదికలో భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొనటానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన ఇతర ముఖ్యమైన కార్యక్రమాలలో కూడా పాల్గొననున్నారు.

## వడదెబ్బతో వృద్ధుడు మృతి

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**



వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దువ్వల రాజయ్య (75) కుటుంబ సభ్యులు యదావిధిగా వ్యవసాయ కులీ పనులు వెళ్లి తిరిగి ఇంటి రాగా ఇంటి వద్దనే ఉన్న రాజయ్య కు తీవ్ర దాహంతో ఉన్న అతనికి నీటిని ఇచ్చిన వెంటనే వడదెబ్బ తీవ్రతకు అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన దువ్వల రాజయ్య మృతి పట్ల స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతుకి లోనై, దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు,కుటుంబ సభ్యులు బంధువులు కోరుతున్నారు.

## నీళ్లు ఇవ్వకపోతే.. నెత్తురు పారుతుంది



సింధూ జలాల నిలిపివేతకు భారతదేశం తీసుకున్న నిర్ణయంపై పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) చీఫ్ బిలావల్ భుట్టో జర్ధారీ మండిపడ్డారు. భారత్‌కు ఘాటు హెచ్చరికలు వెలువరించారు. ఇక్కడ సింధు జలాలు పొంగిపొర్లుతాయా? లేదా అక్కడ మీ భారతీయ రక్తం కట్టలు తెంకుంటుందా? చూద్ధామా అని ఈ యువ నేత రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దిగారు. సింధూ నది పాకిస్థాన్‌ది. దీనిని ఏ శక్తి కాదనలేదు. ఇక్కడి ఈ నీటి కోసం పాకిస్థాన్ నెత్తురుపారిస్తుందని కట్టుబాట్లను వీడి పిపిపి నేత వ్యాఖ్యానించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన ర్యాలీని ఉద్ధేశించి ఆయన జనం హూషార్ మధ్య మాట్లాడారు. ఈ క్రమంలో భుట్టో ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. పాకిస్థాన్ కానీ అంతర్జాతీయ సమాజం కానీ ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలను సహించబోదని, సింధూ జలాల నిలిపివేత మోడీకే కాదు ఎవరికి సాధ్యం కాదని బిలావల్ హెచ్చరించారు. పాకిస్థాన్ తరతరాల నాగరికతకు , ప్రత్యేకించి మెహెంజోదారో శాసనాల్లో లిఖించి ఉంది. ఇక్కడి సింధూ జలాలకు పాకిస్థాన్ నిక్కమైన నిజమైన కాపలాదారు. హక్కుదారు, హక్కును కాదనే శక్తిని తిప్పికొడుతామని పిపిపి నేత తెలిపారు. ఈ జూనియర్ భుట్టే గతంలో పాకిస్థాన్ విదేశాంగ మంత్రిగా వ్యవహరించాడు. భారత ప్రభుత్వ వైఫల్యంతో కశ్మీర్‌లో పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటే, దీనిని కప్పిపుచ్చుకోవడానికి మోడీ సర్కారు ఈ విధంగా నిందలకు దిగుతోందని, ఇటువంటి చర్యలు చెల్లనేరవని భుట్టో హెచ్చరించారు.

# భూ భారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచంలాంటిది

### ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి




సోమవారం వేంసూరు మండలం, కందుకూరు గ్రామంలోని సాయి సింధూ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు హాజరై రైతులకు పలు అంశాలు వివరించారు. భూ భారతి ద్వారా రైతుల భూములు సర్వే చేయించి హద్దులు నిర్ణయించి మ్యాపులతో సహా రిజిస్ట్రేషన్ సమయంలో ఇస్తారన్నారు. దీని వల్ల భూములు కబ్జా చేయడానికి అవకాశం ఉండదనీ, రైతులు తమ భూములను ఆన్‌లైన్లో చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఏవైనా భూ సమస్యలు వస్తే కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని భూ భారతితో 90శాతం తహసీల్దార్ వద్దే పరిష్కారం అవుతాయని తెలిపారు. లేదంటే ఆర్డీవో, కలెక్టర్లకు అప్పీల్ చేసుకోవచ్చన్నారు, భూసమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టం పై అవగాహనను ఏర్పరచుకోవాలని, దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్ప రెడ్డి, కల్లూరు ఆర్ డి ఓ, వేంసూరు ఎం ఆర్ ఓ, ఎం పి డి ఓ, వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి, వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ నాయుకులు, గ్రామ నాయుకులు, కార్యకర్తలు, రైతులు, రెవున్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి ఐద్వా!

### మహిళా సంఘం అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ పై పెంచిన అధిక ధరతో పేద మధ్యతరగతి కుటుంబాలపై అధిక భారం పడుతుందని స్థానిక సత్తుపల్లి పట్టణం లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో కట్టెల పొయతో వంట చేసి నిరసన తెలియజేశారు. సత్తుపల్లి పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రూడ్ అయిల్ ధరలు నిలకడగానే ఉన్నప్పటికీ గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచి ప్రజల మీద భారం మోపుతుందన్నారు. సామాన్యులపై భారాలు వేస్తూ కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తూ పేదలపై భారం పడుతుంది అని అన్నారు. ఇప్పటికే ప్రజలకు ఉపాధి లేక ఆదాయం లేక నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతూ వారి కొనుగోలు శక్తి క్షీణించిందని అన్నారు. ధరలు పెంచుకుంటూ పోతే పేదల జీవనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు వెంటనే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి, రాజ్యలక్ష్మి నాగరత్నం, షర్మిల, బేగం సాబేర, లక్ష్మి, జయశ్రీ ఖాదర్ బి, సమీనా,మునిబ, రజియాబి, బియాన్ బి, తదితరులు పాల్గొన్నారు.






## ఫిలిప్పినో ఉత్సవంలోకి దూసుకుపోయిన వాహనం..

వాంకూవర్‌లో శనివారం రాత్రి ఒక ఫిలిప్పినో సమాజం ఉత్సవంలో జనం మీదికి ఒక వ్యక్తి తన వాహనంతో దూసుకుపోయిన ప్రమాదంలో కనీసం తొమ్మిది మంది వ్యక్తులు మరణించారని కెనడా పోలీసులు ఆదివారం 'ఎక్స్' పోస్ట్‌లో వెల్లడిరచారు. తాము దుర్ఘటన స్థలంలో 30 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేశామని, అతను తమకు 'పరిచయమే' అని పోలీసులు తెలిపారు. అనుమానితుని మొదట జనం వెంటపడి పట్టుకున్నారు. ఈ ఘటనలో కొందరు గాయపడ్డారు. 'ఈ సమయంలో ఈ ఘటన ఉగ్ర చర్య కాదని మాకు నమ్మకం' అని వాంకూవర్ పోలీసులు 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈస్ట్ 41వ అవెన్యూ, ఫ్రేజర్ స్ట్రీట్ సమీపంలో శనివారం రాత్రి 8 తరువాత ఈ దుర్ఘటన సంభవించింది. ఫిలిప్పినో హీరో ఒకరి ఉత్సవం లాపులాపు డే బ్లాక్ పార్టీ ఆ ప్రదేశంలో జరుగుతోంది. 'వాంకూవర్‌లో శనివారం రాత్రి లాపులాపు ఉత్సవంలో భయానక ఘటన జరిగిందని విని దిగ్భ్రాంతి చెందాను' అని కెనడా ప్రధాని మార్క్ కార్నీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. వాంకూవర్ మేయర్ కెన్ సిమ్, బ్రిటిష్ కొలంబియా ప్రధాని డేవిడ్ ఎబీ కూడా 'ఎక్స'లో ఇటువంటి అభిప్రాయాలే వ్యక్తం చేశారు. కెనడా ఫెడరల్ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. బ్రిటిష్ కొలంబియాలో అతిపెద్ద వలసదారుల బృందాల్లో ఒకటైన ఫిలిప్పినో కెనడియన్ సమాజం సాంస్కృతిక సేవలకు గుర్తింపుగా ప్రావిన్స్ ప్రభుత్వం ఏప్రిల్ 27ను లాపులాపు డేగా 2023లో ప్రకటించింది.

## వేములవాడలో అత్యాధునిక నిత్య అన్నదాన సత్రం నిర్మాణం

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కొల్లూరు, తెలంగాణ ముచ్చట్లు:**






శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అత్యాధునిక సదుపాయాలతో నిత్య అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టినట్టు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం శృంగేరి పర్యటనలో భాగంగా కొల్లూరు మూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఆయన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నూతనంగా ఏర్పాటుచేసే అన్నదాన సత్రం, క్యూ లైన్ల నిర్మాణ ప్రణాళికలను పరిశీలించారు.

గత సంవత్సరం నవంబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, మంత్రి పోన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో శ్రీ రాజరాజేశ్వర దేవస్థాన అభివృద్ధి విస్తరణలో భాగంగా రూ.35 కోట్ల వ్యయంతో నిత్య అన్నదాన సత్ర నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్య దృష్ట్యా, తిరుమల శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రం నమూనాలో వేములవాడ రాజన్న ఆలయంలో కూడా అన్నదాన సత్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఇప్పటికే అన్నదాన సత్రం నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయి, పనులు త్వరలో ప్రారంభమవనున్న నేపథ్యంలో ఆది శ్రీనివాస్ కొల్లూరులో వంటశాల, డైనింగ్ హాల్, క్యూ లైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, అర్చకులు శరత్, సురేష్, శర్మ, ఏఈ రామకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలు పరిశీలన

**పెద్దమందడి తహసిల్దార్ సరస్వతి**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను సేకరించి తహసిల్దార్ సరస్వతి సర్వే నిర్వహించారు. సోమవారం ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ధ్రువపత్రాలను, ఇళ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సరస్వతి మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులకు గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్నామని,మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... పేదల సొంతింటి కల నిజం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసిందని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరస్వతి, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, పంచాయతీ సిబ్బంది, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చందు రెడ్డి, రామచంద్రయ్య, గుండెల ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ మల్లికార్జున్, వడ్డే శేఖర్, దయ్యాల శేఖర్, గ్రామస్తులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## కవులు సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేయాలి

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:** కవులు సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేయాలని జిల్లా రావుల గిరిధర్ అన్నారు.వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం వనపర్తికి చెందిన ప్రముఖ పద్య కవి ఆకుల శివరాజలింగం గారు రచించిన కొన్ని పుస్తకాలు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ చదివి పరవశించి ఆనందంతో కవి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సాహిత్యం సమాజ హితాన్ని కోరుతుంది కాబట్టి కవులు సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేయాలని కోరారు. ఆకుల శివరాజలింగం దాదాపు మూడున్నరు దశాబ్దాల పాటు హిందీ భాషోపాధ్యాయులుగా పనిచేశారని తన విశ్రాంత సమయంలో అటు విద్యార్థులకు ఉపయోగపడే రచనలే గాక తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో చక్కటి రచనలు చేశారని కొనియాడారు. సంగీతంలోను మంచి ప్రవేశమున్న ఆయన పలు భజన కీర్తనలు,హరికథలు రాసి తెలంగాణ వాగ్గేయకారుడుగా బెంగుళూరు తెలుగు సంఘం వారిచే అవార్డ్ ను అందుకున్నారని తెలిపారు. ఆకుల శివరాజలింగంను స్ఫూర్తిగా తీసుకొని వర్తమాన కవులు రచనలు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, ఉమామహేశ్వర భజన మండలి సభ్యులు, టి, వెంకట్ రాములు, వై, నగేష్ యాదవ్, నరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు కంప్యూటర్స్, ప్రింటర్స్ సరఫరాకు టెండర్లు ఆహ్వానం

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**మే 9 లోపు టెండర్ ఫారాలు దాఖలు చేయాలి**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన కంప్యూటర్స్, ప్రింటర్స్ సరఫరా చేయుటకు ఆసక్తి గలవారు టెండర్లు దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు 39 డెస్క్ టాప్ కంప్యూటర్స్, 3 ల్యాప్ టాప్ లు, 4 ప్రింటర్స్, 2 ప్రొజెక్టర్స్, 1 జిరాక్స్ మిషన్ సరఫరా చేయుటకు టెండర్లను దాఖలు చేయాలని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ.ఎం.డి. మూడు లక్షలు టెండర్ ఫారం తో సమర్పించాలని, 5 వేల రూపాయలు డిస్టిక్ ఈ గవర్నెన్స్ సొసైటీ పేరున డి.డి. రూపంలో చెల్లించి టెండర్ ఫారం పొంది, మే 9 లోపు టెండర్ ఫారం దాఖలు చేయాలని, మే 13న మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## భూ భారతి చట్టంతోనే రైతుల భూ సమస్యల పరిష్కారం అవుతుంది

**రామసహాయం రఘురామ్ రెడ్డి**



**సత్తుపల్లి, ఆర్ సి, తెలంగాణ ముచ్చట్లు:** సోమవారం సత్తుపల్లి పట్టణం లో భూ భారతి చట్టంతోనే రైతుల భూ సమస్యల పరిష్కారం అవుతాయని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్ రెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

స్థానిక పట్టణం లో రాణి సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ లో 2025 భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతుల సంక్షేమాభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టం తీసుకువచ్చిందని, భూ వివాదాల సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ఎంతగానో దోహదపడుతుందని, నూతన చట్టం భూ భారతి గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు. ప్రజలకు ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులకు సంబంధించిన భూముల పై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం పలు కొత్త అంశాలను పొందుపరుస్తూ నూతన ఆర్ ఓ ఆర్ తెచ్చిందన్నారు. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో చాలా పకడ్బందీగా ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో తీసుకుని రాబోతుందని పేర్కొన్నారు. భూముల రికార్డుల్లో ఏదైనా తప్పులు జరిగి ఉంటే ఈ చట్టం ద్వారా సవరణకు అవకాశం కల్పిస్తారన్నారు. భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎకరాకు రూ.2500 మ్యూటేషన్ రుసుము ఉంటుందన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత బలోపేతం, నిబద్ధతతో పని చేస్తుందని ఖమ్మం ఎంపీ, సత్తుపల్లి ఎమ్మెల్యే, ఖమ్మం కలెక్టర్ తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు, ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయసహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూముల పై పట్టాలను రద్దుచేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూభారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో మండల వ్యవసాయాధికారుల సహకారంతో రైతు వేదికల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ఈ చట్టం పై అవగాహన కార్యక్రమాలు చేపడతామని, భూసమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టం పై అవగాహనను ఏర్పరచుకోవాలని, దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయుకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కల్లూరు ఆర్ డి ఓ, సత్తుపల్లి ఎం.పి.డి.ఓ, సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ వేణు, దొడ్డా శ్రీనివాసరావు పట్టణం, మండలం కాంగ్రెస్ పార్టీ నాయుకులు చల్లగుండ్ల నరసింహారావు, గ్రామ నాయుకులు, కార్యకర్తలు, రైతులు, రెవున్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ జెండా మోసిన వారికే అన్ని పదవులు

**జంగా రాఘవ రెడ్డి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్**



**బెల్లంపల్లి, తెలంగాణ ముచ్చట్లు:** బెల్లంపల్లి పట్టణంలోని ఆర్పి ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

"పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారికే కాంగ్రెస్‌లో అన్ని రకాల పదవులు లభించనున్నాయి," అని ఆయన స్పష్టం చేశారు. పార్టీకి కష్టసమయంలో అండగా నిలిచిన కార్యకర్తలే విజయానికి అసలైన బలం అని గుర్తు చేశారు. నిబద్ధత చూపిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజల సమస్యలను తెలుసుకొని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత కార్యకర్తలదేనని సూచించారు. గ్రామ, మండల కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. "జై భీమ్ - జై బాపు - జై సంవిధాన్" నినాదాలతో ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. సమావేశంలో కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించబడినాయి.



## బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

**మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**



**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు:** సత్తుపల్లి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలకు మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎదురైన అవాంతరాలు, అధికార యంత్రాంగం సహకరించకపోయినా, నియోజకవర్గం నాలుగు మూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు విచ్చేసి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కలిసి సభను ఘనవంతం చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ సభ విజయవంతం కావడంలో పట్టణ పార్టీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల కృషి అమూల్యమని సండ్ర వెంకట వీరయ్య అభిప్రాయపడ్డారు. వారి అంకితభావం, శ్రమ పార్టీకి మరింత బలం చేకూర్చిందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న మద్దతు మరోసారి స్పష్టమైందని, ఈ ఉత్సాహం పార్టీ విజయ యాత్రకు దిక్సూచి కావాలని ఆకాంక్షించారు.

## అంచనాలకు మించి బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** వరంగల్ లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ అంచనాలకి మించి విజయవంతమైందని మాజీమంత్రి అన్నారు. కాంగ్రెస్ 17 నెలల పాలనా వైఫల్యాలు, అబద్దపు హామీలు, దౌర్జన్యాలకు చెంపపెట్టు. ఈ సభ 17 నెలలలో తెలంగాణను అన్ని రంగాల్లో ఆగం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ ప్రశ్నించారు. అంశాలవారీగా వాటికి సమాధానం చెప్పలేని మంత్రులు కారుకూతలు కూస్తున్నారు .. దానిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం. రజతోత్సవ సభతో యావత్ తెలంగాణ కేసీఆర్ వెన్నంటి ఉందని ప్రజలు రుజువు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం గుప్పిట్లో పెట్టుకుని సభ సజావుగా సాగకుండా, ప్రజలు సభకు రాకుండా ఎన్ని అడ్డంకులు సృష్టించినా జన సునామీ ముందు వారి ఆటలు సాగలేదు .మండుటెండలను లెక్కచేయకుండా లక్షలాదిగా తరలివచ్చిన తెలంగాణ ప్రజలకు, ఉమ్మడి పాలమూరు ప్రజలకు, వనపర్తి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు .వరంగల్ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలకు, కార్యకర్తలు, నేతలు, అభిమానులు అందరికీ ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# మేధో సంపత్తితోనే ఆర్థిక ప్రగతి

మేధో సంపత్తి హక్కులు (ఐపిఆర్) అనేది ఆవిష్కరణలు, సాహిత్యం, కళాత్మక రచనలు, వాణిజ్యంలో ఉపయోగించే చిహ్నాలు వంటి సృష్టిని రక్షించే చట్టపరమైన హక్కులు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆవిష్కరణ ఆధారిత వృద్ధివైపు మారుతున్నందున మేధో సంపత్తి హక్కులు గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన దృష్టిని ఆకర్షించాయి. ఈ హక్కులు ఆవిష్కర్తలు తమ పనిని ఎలా ఉపయోగించాలో నియంత్రించడానికి ప్రయోజనం పొందడానికి సహాయం చేస్తాయి. ఈ హక్కుల ప్రధాన రకాల్లో పేటెంట్లు, కాపీరైట్‌లు, ట్రేడ్‌మార్క్‌లు, వాణిజ్య రహస్యాలు, పారిశ్రామిక డిజైన్‌లు, భౌగోళిక సూచనలు ఉన్నాయి. ఈ హక్కులు సృష్టికర్తలకు ఒక నిర్దిష్ట కాలానికి వారి సృష్టిపై ప్రత్యేక నియంత్రణను ఇస్తాయి. ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 26న 'పేటెంట్లు, కాపీరైట్, ట్రేడ్‌మార్క్‌లు, డిజైన్‌లు రోజువారీ జీవితంపై ఎలా ప్రభావం చూపుతాయో అవగాహన పెంచడానికి జరుపుకుంటారు. 2000లో ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్లుఐపిఒ) ఏప్రిల్ 26ని ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవంగా ఎంపిక చేసింది. ఈ 2025 సంవత్సర వేడుక మేధో సంపత్తి, సంగీతంపై దృష్టిపెడుతుంది. సంగీత పరిశ్రమలో హక్కులు, ఆవిష్కరణ విధానాలు సృష్టికర్తలు, వ్యవస్థాపకులు సంగీత పరిశ్రమకు తాజా ఆలోచనలను తీసుకురావడానికి, పాటల రచయితలు, స్వరకర్తలు, ప్రదర్శకుల పనిని రక్షించడానికి ఎలా శక్తినిస్తాయో అన్వేషించడం లక్ష్యంగా ఉన్నాయి. మేధో సంపత్తి వ్యక్తులు, వ్యాపారాలు సమాజానికి చట్టపరమైన రక్షణ, పోటీప్రయోజనం, ఆదాయ అవకాశాలు, పెట్టుబడులను ఆకర్షించడం, ఆవిష్కరణ, సృజనాత్మకతను ప్రోత్సహించడం, ఆర్థిక వృద్ధి, ప్రపంచ గుర్తింపు, విస్తరణ, వ్యక్తిగత గుర్తింపు మొదలైన అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అంతర్జాతీయ మేధో సంపత్తి సూచికలో, యునైటెడ్ స్టేట్స్ 95.48% స్కోరుతో సూచికలో ముందుంది, తరువాత యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్ ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు వాటి ఆర్థిక, విద్య, సాంకేతిక ప్రయోజనాలతో ముడిపడి ఉన్న కొన్ని ముఖ్యకారణాల వల్ల ఎక్కువ మేధో సంపత్తి హక్కులను పొందడంలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వారి సంపత్తి హక్కుల (ఐపి) ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ప్రపంచ మేధో సంపత్తి హక్కుల సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ వాణిజ్య మేధోసంపత్తి హక్కులు (టిఆర్ఐపిఎస్) ఒప్పందం ద్వారా ప్రపంచ మేధో సంపత్తి నియమాలపై విధాన ప్రభావంతోపాటు బలమైన పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి) పెట్టుబడి, అధునాతన విద్య, ఆవిష్కరణ వ్యవస్థలు, బలమైన చట్టపరమైన %డ% మేధోసంపత్తి మౌలిక సదుపాయాలు, జ్ఞానఆధారిత ఆర్థిక వ్యవస్థ, వనరులు ప్రపంచ వ్యాపార వ్యూహం ఉన్నాయి. భారతదేశం పనితీరును చూసినప్పుడు, భారతదేశం 38.64% స్కోరుతో 42వ స్థానంలో స్థిరంగా ఉంది. ఇది స్థిరమైన మేధో సంపత్తి చట్రాన్ని సూచిస్తుంది. 64,480 దరఖాస్తులతో భారతదేశం పేటెంట్ దాఖలులో ప్రపంచవ్యాప్తంగా 6వ స్థానంలో ఉంది. ట్రేడ్‌మార్క్ దాఖలులో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా 4వ స్థానంలో ఉంది. గత సంవత్సరంతో పోలిస్తే 6.1% పెరుగుదల. ఇది భారతదేశం బ్రాండ్‌పై పెరుగుతున్న ప్రాధాన్యతను సూచిస్తోంది. 2023 24 ఆర్థిక సంవత్సరంలో, భారత పేటెంట్ కార్యాలయం 1 లక్షకు పైగా పేటెంట్లను మంజూరు చేసింది. ఇది మునుపటి సంవత్సరం కంటే గణనీయమైన పెరుగుదల. ఇప్పటికీ భారతదేశంలో మేధో సంపత్తి హక్కులు చారిత్రాత్మకంగా ఆర్థిక, చట్టపరమైన, విద్య, సాంస్కృతిక కారణాల వల్ల అభివృద్ధి చెందిన దేశాల కంటే వెనుకబడి ఉన్నాయి. భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిలో సాపేక్షంగా తక్కువ శాతాన్ని పరిశోధన, అభివృద్ధిలో 0.7% పెట్టుబడిపెడుతుంది. ఇది అభివృద్ధి చెందిన దేశాలలో దాదాపు 23%. భారతదేశంలో అగ్రశ్రేణి సంస్థలు (ఐఐటిలు, ఐఐఎస్‌సి వంటివి) ఉన్నప్పటికీ, ఆవిష్కరణ మేధో సంపత్తి హక్కుల అవగాహన కోసం మొత్తం పర్యావరణ వ్యవస్థ అసమానంగా ఉంది. భారతదేశంలో మేధో సంపత్తి హక్కుల దాఖలు అమలు ప్రక్రియ సంక్లిష్టంగా, తక్కువ వనరులతో కూడుకున్నది. పేటెంట్ ఆమోదాల కోసం ఎక్కువసేపు వేచిఉండటం బలహీనమైన అమలు మేధో సంపత్తి హక్కుల దాఖలు చేయడానికి ప్రేరణను తగ్గిస్తుంది. మేధో సంపత్తి హక్కుల నమోదు ముఖ్యంగా పేటెంట్లు అంతర్జాతీయ దాఖలు ఖరీదైనది. విద్యార్థులు, నిపుణులలో కూడా మేధో సంపత్తి హక్కుల విలువ గురించి అవగాహన లేకపోవడం ఒక లోపమే. భారతదేశ ఆర్థిక వ్యవస్థ హైటెక్ ఉత్పత్తి ఆవిష్కరణల కంటే సేవల ద్వారా (ఐటి, అవుట్‌సోర్సింగ్ కన్సల్టింగ్ వంటివి) ఎక్కువగా నడపబడుతోంది. భారతదేశం దాని మేధో సంపత్తి విధానాలపై అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికా వంటి దేశాల నుండి విమర్శలను ఎదుర్కొంది. దేశంలో మేధోసంపత్తి పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి, భారత ప్రభుత్వం 2016లో అన్ని మేధో సంపత్తి హక్కులలను ఒకే దార్శనిక పత్రంలోకి చేర్చి, మేధోసంపత్తి హక్కుల చట్టాల అమలు, పర్యవేక్షణ సమీక్ష కోసం ఒక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. స్టార్టప్‌లు తమ పేటెంట్, డిజైన్ లేదా ట్రేడ్‌మార్క్ అప్లికేషన్‌లను దాఖలు చేయడానికి, ప్రాసెస్ చేయడానికి 2016లో స్టార్టప్‌ల మేధో సంపత్తి రక్షణ పథకం (ఎస్ఐపిపి) వంటి కొన్ని కీలక చర్యలు ప్రారంభించబడ్డాయి.నేషనల్ లా యూనివర్సిటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు సహా 38 విశ్వవిద్యాలయాలలో మేధో సంపత్తి హక్కుల అధ్యయనం, విద్య, పరిశోధన, అవగాహనను ప్రోత్సహించడానికి డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డిపిఐఐటి) ఉన్నత విద్యా సంస్థలలో ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్‌లను నియమించింది. మేధోసంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్/గ్రాంట్ ప్రక్రియలపై వినియోగదారులకు తక్షణ మద్దతు మార్గదర్శకత్వం అందించడానికి మేధోసంపత్తి హక్కుల సారథి చాట్‌బాట్ రూపొందించబడిరది. భారతదేశంలో ప్రభావవంతమైన మేధో సంపత్తి హక్కుల అమలును గుర్తించడానికి ప్రోత్సహించడానికి 13 విభాగాలలో జాతీయ మేధో సంపత్తి అవార్డులను ఏటా ప్రదానం చేస్తారు. పేటెంట్ సముపార్జనను సులభతరం చేయడానికి పేటెంట్స్ (సవరణ) నియమాలు, 2024 ను నోటిఫై చేశారు. మేధో సంపత్తి హక్కుల పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి, స్టార్టప్‌లు తమ ఐపీని రక్షించుకోవడానికి ప్రోత్సహించడానికి ఫీజు రాయితీలు ఇవ్వబడ్డాయి. స్టార్టప్‌లు, చిన్న సంస్థలకు పేటెంట్లలో 80% వరకు, ట్రేడ్‌మార్క్‌లలో 50%, డిజైన్లలో 75% వరకు ఫీజు రాయితీ ఇవ్వబడుతోంది. మేధో సంపత్తి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది కాబట్టి, దీర్ఘకాలిక వ్యూహంతో మరిన్ని మేధో సంపత్తి హక్కులని సాధించాలి.

## నాట్యకళ ఓ శక్తివంతమైన
# వారసత్వ సంపద


నాట్యం ఓ విశ్వ భాష. ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాంస్కృతిక సాధనం. నాట్యాన్ని మెచ్చని నరులుండరు. నాట్యం చేయడానికి వేదికను ఎక్కడం లేదా నాట్యాన్ని వీక్షించడానికి కళాభిమానిగా ప్రేక్షకుల్లో ఉంటూ కళను ఆస్వదించడం తరుచుగా చేస్తున్నాం. ఒక మహాద్భుత అనుభూతిని, ప్రేరణను, అమితానందాన్ని అందిస్తున్నది నాట్య కళ. వివిధ ప్రాంతాల, దేశాల ప్రజలు వేరు వేరు నాట్య రూపాలను ప్రోత్సహిస్తున్నారు లేదా ప్రచారం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. నాట్య కళ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఏట 29 ఏప్రిల్ రోజున విశ్వవ్యాప్తంగా ''అంతర్జాతీయ నాట్య దినోత్సవం'' లేదా ''ఇంటర్నేషనల్ డాన్స్ డే''ను యునెస్కోతో కలిసి ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా 1982 నుంచి నిర్వహించడమ ఆనవాయితీగా మారింది. ప్రపంచ ప్రఖ్యాత నాట్య కళాకారులు జీన్స్ జార్జెస్ నవ్వేరీ జన్మదినం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు.స్వయం ప్రకటనకు నిలువెత్తు నిదర్శనం నాట్యం మాత్రమే. దాదాపు 9,000 ఏండ్ల క్రితమే ప్రారంభమైన నృత్య కళ నేడు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రజల వన్నులు పొందుతున్నది. సాంస్కృతిక సరిహద్దులు చెరుపుతూ విశ్వవ్యాప్తం కావడం, వైవిధ్యభరితమైన మానవాళిని ఒకే వేదికపైకి తీసుకురావడం, కళాభిమానులకు మానసిక ప్రశాంతతను చేకూర్చడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన నాట్యకళ ఆనందాలు పంచుతూ దేహం, మనసు, హృదయం, ఆత్మలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యం ద్వారా వ్యక్తిగత అభినయం, శరీర భాగాల సమన్వయం, భావోద్వేగాలను ఆకర్షణీయంగా వ్యక్తీకరించడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం జరుగుతుంది.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సువిశాల భారతంలో ఎన్నో శాస్త్రీయ, జానపద నాట్యాలు ప్రజాదరణను పొందాయి. భారత సంగీత అకాడమీ గుర్తించిన ఎనిమిది శాస్త్రీయ నృత్య కళల్లో భరతనాట్యం, కూచిపూడి, కథకుల, కథక్, ఒడిసి, మోహినీయాట్టం, మణిపురి, సత్రియాలు వస్తాయి. భారత దేశవ్యాప్తంగా 29 జానపద నాట్య కళారూపాలను గుర్తించినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రచారం పొందిన జానపద నాట్యాల్లో విలాసిని, భామాకలాపం, వీర నాట్యం, డప్పు, తప్పెటగుళ్లు, లంబాడి, ధింసా, కోలాటం, పేరిణి, బుర్ర కథ, గుస్సాడి, చిందుల బాగోతం, బుట్ట బొమ్మలు, బోనాలు లాంటివి ఉన్నాయి. డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవను చూపాలి. నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి. నాట్య కళాకారులను తగు రీతిలో గుర్తించడం, చిన్నారులకు నాట్య శిక్షణ ఇప్పించడం, నాట్య కళాశాలలను ఏర్పాటు చేయడం, నాట్య శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించడం, నాట్య కళ పట్ల సమాజంలో చిన్న చూపును రూపుమాపడం లాంటి చర్యలు సత్వరమే తీసుకొని మన నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నాలు జరగాలి.



# సాగునీటి వివక్షతపై ఎలుగెత్తి చాటిన విద్యాసాగర్ రావు

వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టుల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ప్రాజెక్టులపై జరిగిన అన్యాయం పై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయం పై ఎలుగెత్తి చాటారు. నీటి పారుదల శాఖలో వివిధ పదవులలో, హోదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రాజెక్టులు, నీటి కేటాయింపు లపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు. సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ను ప్రేరేపించడంలో, ఉద్యమ తెరాస పార్టీ అధినేతకు వెన్నుదన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు ఆంతరంగిక ముఖ్యులలో ఒకరై పోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విడదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది.. ''జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహాను భావుడు విద్యాసాగర్ రావు'' అని కేసీఆర్ చేత ప్రశంసింప బడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన. ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 19392017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యా వంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువు పట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలిసారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవరావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్ పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం. విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ)




లో నీటి వనరుల అభివృద్ధిలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలోరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరిం గులో డిప్లొమా పొందారు. ఆయన 1990లో ఢల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు. బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజనీరుగా ఉద్యోగంలో చేరారు. కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజ నీరుగా పనిచేశారు. ఢల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్సరాల పాటు కేంద్ర జల సంఘం లోనే విధులు నిర్వహించడం తో ఆయన దేశ వ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడిరచారు. తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల విషయాలపై సమగ్ర అవగా హన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబ రులో కాకతీయ విశ్వ విద్యాలయం చే నిర్వహించ బడిన ''మిషన్ కాకతీయ'' ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టు లపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు.2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారత దేశం) ఆయనను ''లీడిరగ్ ఇంజ నీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా''గా గుర్తించి, పురస్కార గ్రహీతను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాలన్నింటినీ కలిపి.. 'నీళ్లునిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా ''నీళ్ళు నిజాలు విద్యాసాగర్ రావు''గా పేరెన్నిక గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు. ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యుడిగా, సెంట్రల్ వాటర్ కమి షన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా సుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చూపిన ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు. గిరీషం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు. కొంతకాలం ఆనారోగ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో దివంగ తులైనారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భారత్‌పై అణుబాంబులతో విరుచుకుపడుతాము..

భారతదేశంపై అణుబాంబులతో విరుచుకుపడుతామని పాకిస్థాన్ హెచ్చరించింది. ఆదివారం పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ భారత్‌పై ఇక బహిరంగ అణ్వాయుధ ప్రతీకార దాడికి దిగుతామని హెచ్చరించారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న 130 అణ్వాయుధ వ్యవస్థలను మహరించినట్లు వీటికి తోడుగా ఘోరి, షహీన్, గజ్నవి వంటి క్షిపణులను సిద్ధం చేశామని, ఇక భారతదేశం దారికి రాకపోతే వీటిని ప్రయోగించి తీరుతామని ఆయన హెచ్చరించారు. పాకిస్థాన్‌కు భారతదేశం నీటి సరఫరా నిలిపివేసి చూస్తే ఇక పరిస్థితి ఎంత తీవ్ర స్థాయికి వెళ్లుతుందో తాము చెప్పలేమని అన్నారు. ఇక కాబోయే చర్యలు తమ దేశ సైనిక వర్గాలు చూసుకుంటాయి. తమ వద్ద ఉన్న ఆయధాలకు తిరుగులేదు, ఇక ప్రత్యేకించి అణుబాంబుల గురించి చెప్పాల్సిన పనిలేదని మంత్రి వివరించారు. భారత్‌పై ఇక తమది పూర్తి స్థాయి యుద్ధం అని ప్రకటించారు. ఈ మంత్రి ప్రకటన పలువిధాలుగా కలవరం లేవనెత్తింది. తమ దేశంలో పలు చోట్ల అత్యంత వ్యూహాత్మకంగా అణ్వాయుధాలను నిలిపి ఉంచినట్లు ఆయన తెలిపారు. పాకిస్థాన్ గగనతలంపై వైమానిక యానం నిషేధాన్ని అమలు చేస్తే అది భారత్‌కు పిడుగుపాటు అవుతుందని, వెంటనే భారత్‌కు చెందిన పలు వైమానిక సంస్థలు కుప్పకూలుతాయి. ఇండియన్ ఎయిర్‌లైన్స్ పతనం కేవలం భారత ప్రభుత్వ చేతల్లో ఉందని తెలిపారు. తాము అణ్వాయుధాలను కేవలం ప్రదర్శనలకు సిద్ధం చేసుకోలేదని , వీటికి పనిచెప్పే క్షణం ఇప్పటికీ వచ్చిందని వ్యాఖ్యానించారు. బెదిరిస్తే బెదిరిపోం, రెచ్చగొడితే చూస్తూ ఊరుకునేది లేదని, ఏరిపారేస్తామని తెలిపారు. తమ అణ్వాయుధ శక్తి పాటవం గురించి భారత్‌కు సర్గైన అవగావహన లేదన్నారు. భారతదేశంపైకి తమ ఆయుధాలు ఏ దిక్కు నుంచి ఎప్పుడు ఏ విధంగా వచ్చిపడుతాయనేది ఎవరికి తెలియదని తెలిపారు. ఇక్కడి ఖండాంతర భీకర క్షిపణుల గురిని పూర్తిగా భారత్ వైపు నిలిపివుంచామని ,ఇక ట్రిగ్గర్ నొక్కడమే తరువాయి అని, విధ్వంసానికి బాధ్యులు ఎవరు? అనేది తరువాత తెలుసుకుని ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. ఉగ్రదాడుల సాకుతో పాకిస్థాన్‌కు ఏకపక్షంగా నదీ జలాల పంపిణి నిలిపివేస్తారా? గగనతల రాకపోకలకు వీలు కల్పించకుండా ఉంటారా? వీసాల రద్దుకు దిగుతారా? దీని వల్ల నష్టం ఎవరికి తెలుసా? అని ప్రశ్నించారు.






## అట్టారి మీదుగా 509 మంది పాక్ జాతీయుల నిష్క్రమణ

పాకిస్తాన్‌కు చెందిన 12 కేటగరీల స్వల్పకాలిక వీసాదారులకు దేశం వీడివెళ్లేందుకు గడువు ఆదివారం ముగియగా శుక్రవారం నుంచి మూడు రోజుల్లో తొమ్మిది మంది దౌత్యవేత్తలు, అధికారులతో సహా 509 మంది పాకిస్తానీ జాతీయులు అట్టారి వాఘా సరిహద్దు మీదుగా భారత్ నుంచి నిష్క్రమించినట్లు అధికారులు వెల్లడిరచారు. పంజాబ్‌లో గల ఆ అంతర్జాతీయ సరిహద్దు మీదుగా 14 మంది దౌత్యవేత్తలు, అధికారులు సహా 745 మంది భారతీయులు పాకిస్తాన్ నుంఇ తిరిగి వచ్చారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు ఈ నెల 22న పర్యాటకులు సహా 26 మందిని హతమార్చిన తరువాత 'దేశం వీడివెళ్లండి' అని పాకిస్తానీ జాతీయులకు ప్రభుత్వం నోటీస్ జారీ చేసింది. ఆదివారం అట్టారి వాఘా సరిహద్దు మీదుగా తొమ్మిది మంది దౌత్యవేత్తలు, అధికారులతో సహా 237 మంది పాకిస్తానీ జాతీయులు భారత్‌ను వీడి వెళ్లారని, శనివారం 81 మంది, శుక్రవారం 191 మంది పాకిస్తానీ జాతీయులు అలా వెళ్లిపోయారని అధికారులు 'పిటిఐ'తో చెప్పారు. కొంత మంది పాకిస్తానీలు విమానాశ్రయాల ద్వారా కూడా దేశం వదలి వెళ్లి ఉండవచ్చునని, అయితే, పాకిస్తాన్‌తో భారత్‌కు నేరుగా విమాన సర్వీసుల అనుసంధానం లేనందున వారు ఇతర దేశాలకు వెళ్లి ఉండవచ్చునని అధికారులు తెలిపారు.



## పహల్గాం కేసు ఎన్‌ఐఎకు..
## విచారణ ముమ్మరం చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఇ టీవల జరిగిన ఘోర ఉగ్ర దాడి కేసు దర్యాప్తు బా ధ్యతలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) స్వీకరించింది. ఈ దాడిలో ఒక నేపాల్ జాతీయునితో సహా మొత్తం 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ కేసును ఎన్‌ఐఎకి బదలీ చేసినట్లు అధికారిక ప్రకటన వెలువడిరది. ఇప్పటి వరకు ఈ కేసు దర్యాప్తును జమ్మూ కాశ్మీర్ పోలీసులు పర్యవేక్షించారు. అయితే, ఘటన తీవ్రత దృ ష్టా కేంద్ర ప్రభుత్వం దీనిని ఎన్‌ఐఎకి అప్పగించాలని నిర్ణయించింది. ఎన్‌ఐఎకి కేసు అప్పగించడం తో జమ్మూ కశ్మీర్‌లో అధికారికంగా దర్యాప్తు సంస్థ పహల్‌గామ్ ఘటనపై కేసు నమోదు చేసింది. దాడి జరిగిన మరునాడు ఈ నెల 23 నుంచే ఎన్‌ఐఎ బృందాలు పహల్‌గామ్‌లోని ఘటన స్థలంలో మోహరించాయి. ఐజి, డిఐజి, ఎస్‌పి స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఈ బృందాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి. సుందర పర్యాటక ప్రదేశం బైసరన్ లోయలో ఈ నెల 22న ఈ భయానక దా డిని ప్రత్యక్షంగా చూసిన సాక్షులను ఎన్‌ఐఎ అధికారులు క్షుణ్ణంగా విచారిస్తున్నారు. సంఘటన జ రిగిన తీరును, ఉగ్రవాదుల కదలికలను కూలంకషంగా అడిగి తెలుసుకుంటున్నారు. ఉగ్రవాదులు ఘటన స్థలానికి ఎలా చేరుకున్నారు, దాడి తరువాత ఎలా తప్పించుకున్నారు అనే కోణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఎన్‌ఐఎ బృందాలు నిశితం గా పరిశీలిస్తున్నాయి. ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో ఘటన స్థలంలో లభించే చిన్న ఆధారాన్నీ జాగ్రత్తగా సేకరిస్తున్నారు. ఈ దాడికి పాల్పడిన ఉ గ్రవాదులను పట్టుకునేందుకు భద్రత బలగాలు ఇ ప్పటికే కాశ్మీర్ లోయలో గాలింపు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా గతం లో ప్రకటించిన పది మంది ఉగ్రవాదులకు చెందిన ఇళ్లను అధికారులు కూల్చివేశారు.




## కస్తూరిరంగన్‌కు ప్రధాని మోడీ నివాళి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాజీ చైర్మన్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీ ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. ఆయనకు మోడీ నివాళులు అర్పించారు. ఆదివారం ప్రధాని మోడీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో మాట్లాడుతూ, దేశం ఒక గొప్ప శాస్త్రవేత్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్ర, విద్యా రంగాలకు, ముఖ్యంగా భారత అంతరిక్ష కార్యక్రమాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో కస్తూరిరంగన్ చేసిన విశేష కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని ప్రధాని చెప్పారు. ఆయన నాయకత్వంలో ఇస్రోకు నూతన గుర్తింపు లభించిందని, ఆయన మార్గదర్శకత్వంలో పురోగమించిన అంతరిక్ష కార్యక్రమం దేశానికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తెచ్చిపెట్టిందని మోడీ కొనియాడారు, ప్రస్తుతం భారత్ వినియోగిస్తున్న అనేక ఉపగ్రహాలు కస్తూరిరంగన్ పర్యవేక్షణలోనే ప్రయోగించిన విషయాన్ని మోడీ గుర్తు చేసుకున్నారు. నూతన విద్యా విధానం (ఎన్ఇపి) రూపకల్పనలో డాక్టర్ కస్తూరిరంగన్ కీలక పాత్ర పోషించారని ప్రధాని తెలియజేశారు. 21వ శతాబ్దానికి అనుగుణంగా భవిష్యత్ దృక్పథంతో కూడిన విద్యా వ్యవస్థ ఆవిష్కరణకు ఆయన ఎంతో దోహదం చేశారని మోడీ చెప్పారు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన, ఆవిష్కరణలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని మోడీ అన్నారు. దేశ నిర్మాణం కోసం కస్తూరిరంగన్ అందించిన నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని అంటూ ప్రధాని ఆయనకు వినమ్ర నివాళులు అర్పించారు. అంతకు ముందు శుక్రవారం కూడా ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా కస్తూరిరంగన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, దేశ శాస్త్ర, విద్యా రంగ ప్రస్థానంలో ఆయన ఒక శిఖర సమానులు అని అభివర్ణించిన విషయం విదితమే.

## లెబనాన్‌పై ఇజ్రాయిల్ బాంబుల వర్షం..



**బీరుట్** : ఇజ్రాయిల్ దళాలు మరోసారి లెబనాన్‌పై విరుచుకుపడ్డాయి. ఆదివారం బీరుట్ దక్షిణశివారు ప్రాంతాలపై ఇజ్రాయిల్ జెట్‌లు బాంబుల వర్షం కురిపించాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంపై ఇజ్రాయిల్ చేసిన మూడవ దాడి ఇది. ఆదివారం తెల్లవారుజామున దక్షిణ లెబనీస్ గ్రామమైన హల్టాలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక వ్యక్తి మరణించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. అయితే హిజ్బుల్లా సభ్యుడు లక్ష్యంగా దాడులు జరిపామని, అతను మరణించాడని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. దాడి అనంతరం ఆ ప్రాంతమంతటా భారీ ఎత్తున పొగ కమ్ముకుంది. రెండు భవనాల మధ్య ఉన్న లోహపు గుడారం వంటి నిర్మాణంపై మూడు బాంబులు పడినట్లు స్థానిక మీడియా జర్నలిస్ట్ వెల్లడిరచారు. పూర్తిగా దగ్ధమైన రెండు ట్రక్కుల ఫోటోలు సోషల్‌మీడియాలో కనిపిస్తున్నాయి. ప్రాణనష్టంపై నివేదికలు విడుదల కావాల్సి వుంది.ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకి చెందిన జిపిఎస్‌తో కూడిన క్షిపణుల నిల్వలపై దాడులు చేసినసట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. అటువంటి పరికరాలను నిల్వ చేయడం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది.దాడికి గంట ముందు ఇజ్రాయిల్ హెచ్చరికను జారీ చేసింది. హదత్ ప్రాంతంలోని హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. నివాసితులు ఆప్రాంతం నుండి దాదాపు 300 మీటర్ల దూరం తరలి వెళ్లాలని హెచ్చరించింది. బీరుట్‌పై దాడికి ముందు అల్‌జామస్ పరిసరాల సమీపంలోని కొన్ని ప్రాంతాల్లో యుద్ధ విమానాల సైరన్‌లు వినిపించాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. స్థానికులను హెచ్చరించేందుకు గాల్లోకి కాల్పులు కూడా జరిగాయని అన్నారు. పలు కుటుంబాలు ప్రాణ భయంతో పరుగులు తీశారని అన్నారు. ఇజ్రాయిల్ దాడిని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ ఖండిరచారు. కాల్పుల విరమణకు హామీ ఇచ్చిన అమెరికా, ఫ్రాన్స్‌లు ఈ దాడికి సమాధానమివ్వాలని అన్నారు. దాడులను నిలిపివేయాల్సిందిగా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## పహల్గామ్ ఉగ్రదాడి..
## 16 పాక్ యూట్యూబ్ ఛానళ్లపై నిషేధం

పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తానీయులను భారత్ నుంచి వెళ్లిపోవాల్సిందిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడికి పాల్పడిన వారికోసం భారత ఆర్మీ కాశ్మీరను జల్లెడపడుతోంది. ఇప్పటికే పలువురు ఉగ్రవాదులకు సంబంధించిన ఇళ్లను ధ్వంసం చేశారు. తాజాగా భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ సహా పలువురు పాకిస్థానీయుల ఛానళ్లపై నిషేధం విధించింది. రెచ్చగొట్టే, మతపరంగా సున్నితమైన కంటెంట్, తప్పుడు కథనాలను వ్యాప్తి చేసినందుకు 16 పాకిస్తానీ యూట్యూబ్ ఛానెల్‌లను నిషేధించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 3.5 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్‌లతో కొనసాగుతున్న షోయబ్ అక్తర్ యూట్యూబ్ ఛానెల్‌ను కూడా నిషేధించారు. దాదాపు 63 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్‌లను కలిగి ఉన్న నిషేధిత ప్లాట్‌ఫామ్‌లలో డాన్ న్యూస్, సమా టీవీ, AR న్యూస్, బోల్ న్యూస్, రఫ్తార్, జియో న్యూస్, సునో న్యూస్ వంటి ప్రధాన పాకిస్తానీ వార్తా ఛానెల్‌లు ఉన్నాయి. ఇర్షాద్ భట్టి, అస్మా షిరాజీ, ఉమర్ చీమా, మునీబ్ ఫరూక్ వంటి జర్నలిస్టులు నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్స్ తోపాటు ది పాకిస్తాన్ రిఫరెన్స్, సమా స్పోర్ట్స్, ఉజైర్ క్రికెట్, రజి నామా వంటి ఇతర ఛానెల్స్ ను నిషేధించారు.

## పిఓకె లో ఆకస్మిక భారీ వరదలు

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె)లో రెండు రోజులుగా ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. దీనితో ఇక్కడి జనం అతలాకుతలం అవుతున్నది. జీలం నది జలాలను భారతదేశం తన భూభాగంలోకి విడుదల చేయడంతో ఈ వరదల ముప్పు తలెత్తిందని పాకిస్థాన్ అధికారిక నిరసన వ్యక్తం చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దౌత్యయుద్ధానికి తోడుగా ఇప్పుడు నదీజలాల వివాదం రగులుకుంది. పిఓకెలోని హట్టియన్ బాలాలో ఇప్పుడు జల అత్యయిక పరిస్థితిని ప్రకటించారు. స్థానికులలో భయాందోళనలు నెలకొన్నాయి. దూర ప్రాంతాలకు తరలివెళ్లేందుకు వారు సిద్ధం అయ్యారు. భారతదేశం ప్రతీకార ధోరణితోనే జీలం నది నీళ్లను శనివారం వదిలిపెట్టిందని పాకిస్థాన్ ఆరోపించింది. ముందుగా సంబంధిత అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. దీనితో వరదల ముప్పు తలెత్తిందని తెలిపారు. పిఓకెలోని ప్రధాన నగరం ముజఫరాబాద్ పరిసర ప్రాంతాలలో నీటి మట్టం విపరీతంగా పెరిగింది. కాలువలు గట్టు తెంచుకుని ఉరుకుతున్నాయి. దీనితో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయని అక్కడి వారు తెలిపారు. పలు ప్రాంతాలలో వాటర్ ఎమర్జెన్సీ విధించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆదేశాలు వెలువరించారు. జీలం నది ఒడ్డునే ఉన్న హట్టియన్ ప్రాంతంలో పరిస్థితి దిగజారుతోంది. స్థానికులను అక్కడి మసీదుల మైక్‌ల ద్వారా హెచ్చరిస్తున్నారు. ఎత్తైన ప్రాంతాలకు వెళ్లి తల దాచుకోవాలని కోరుతున్నారు, దీనితో నది వెంబడి జనం ఉరుకులు పరుగులు , గందరగోళం నెలకొంది.కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ వద్దకు చేరిన నీరు ఉధృత రూపంలో పిఓకెలోని ఛకోటి ప్రాంతాన్ని చుట్టుముట్టింది. తమ దేశంపై భారతదేశం అప్రకటిత జల యుద్ధానికి దిగిందని అక్కడి వారు వాపోతున్నారు. ఇది పూర్తిగా అంతర్జాతీయ కట్టుబాట్లకు విరుద్ధం. కుదుర్చుకున్న నదీ జలాల ఒప్పందాలను తీసి గట్టున పెట్టడమే అని విమర్శించారు.



## రష్యాకు మద్దతుగా ఉత్తర కొరియా

రష్యాఉక్రెయిన్ ల మధ్య జరుగుతున్న పోరులో రష్యాకు మద్దతుగా తన బలగాలను పంపినట్లు ఉత్తర కొరియా తొలిసారిగా ధృవీకరించింది. కుర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ సైన్యం ఆధీనంలో ఉన్న రష్యన్ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో తమ దళాలు దోహదపడ్డాయని తెలిపింది. ఈ విషయాన్ని ఉత్తర కొరియా అధికారిక కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కెసిఎన్ఎ)కి సోమవారం అందించిన ఒక ప్రకటనలో పేర్కొంది. పాలక వర్కర్స్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్, మాస్కో మరియు ప్యోంగ్యాంగ్ మధ్య పరస్పర రక్షణ ఒప్పందంలో భాగంగా ఆ దేశ నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ రష్యన్ దళాలతో పాటు యుద్ధానికి తమ దళాలను పంపారని తెలిపింది. ఉక్రెయిన్ నయానాజీ ఆక్రమణదారుల విధానాలను అమలు చేస్తూ ఆక్రమించిన కుర్స్క్ ప్రాంతాన్ని విముక్తి చేయడానికి రష్యన్ సాయుధ దళాలకు సహకరిస్తూ సైన్యాన్ని మోహరించామని తెలిపింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, కిమ్ గత సంవత్సరం జూన్‌లో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేశారు. యుద్ధం జరిగినప్పుడు రెండు దేశాలు సైనికపరంగా ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి ముందుకు రావాలని హామీ ఇచ్చారు.

## ముంబయి ఇడి భవనంలో ఘోర అగ్ని ప్రమాదం



దక్షిణ ముంబయిలో ఆదివారం తెల్లవారు జామున ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కార్యాలయ భవనంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించిందని, అయితే, ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం ఏమీ జరగలేదని అధికారులు వెల్లడిరచారు. బల్లార్డ్ ఎస్టేట్ ప్రాంతంలోని కైజర్ ఇహింద్ భవనంలో ఆదివారం తెల్లవారు జామును సుమారు 2.31 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించిందని అధికారులు తెలిపారు. ఇడి కార్యాలయం ఉన్న ఐదు అంతస్తుల భవనంలోని నాలుగవ అంతస్తులో మొదలైన మంటలు గంటలపాలు ప్రజ్వరిల్లాయని, వాటిని చివరకు అదుపు చేశారని అధికారులు వివరించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు లేచాయని, ఫర్నిచర్, కప్‌బోర్డులు, విద్యుత్ సాధనాలు ధ్వంసం అయ్యాయని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. పోలీస్ బృందాలు ఆ ప్రదేశంలో ఉన్నట్లు, పంచనామా నిర్వహిస్తున్నట్లు, మరింత దర్యాప్తు సాగుతున్నట్లు ఆయన తెలియజేశారు. కాగా, తెల్లవారు జామున సుమారు 4.17 గంటలకు ముంబయి ఫైర్ బ్రిగేడ్ అగ్ని ప్రమాదాన్ని లెవెల్ 3కి పెంచింది. దానిని ఘోర అగ్ని ప్రమాదంగా పరిగణిస్తారు. మంటల నియంత్రణకు ఎనిమిది ఫైరింజన్లు, ఆరు జెట్టీలు, వాటర్ ట్యాంకర్లు, ఇతర పరికరాలను నియోగించినట్లు ఫైర్ బ్రిగేడ్ అధికారి ఒకరు తెలిపారు. కార్యాలయం లోపల పలు పత్రాలు, పరికరాలు ధ్వంసమైనట్లుగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.

# హిట్ దర్శకుడికి నాగార్జున గ్రీన్ సిగ్నల్ ?

టాలీవుడ్ క్రైమ్ జానర్ లో తనదైన ముద్ర చూపించిన దర్శకుడు శైలేష్ కొలను. హిట్ 1 తక్కువ బడ్జెట్ తో విజయం సాధించి, హిట్ 2 కి అడివి శేష్ లాంటి క్రేజీ హీరో తోడై, ఇప్పుడు హిట్ 3కి ఏకంగా నానినే హీరోగా మారే దాకా దీని రేంజ్ అంతకంతా పెరుగుతూ పోయింది. శైలేష్ సినిమాటిక్ యునివర్స్ పేరుతో త్వరలోనే వీళ్లందరినీ కలిపేలా అవెంజర్స్ తరహా మూవీ ప్లానింగ్ లో ఉన్నాడు శైలేష్ కొలను. అయితే దీనికి చాలా టైం పడుతుంది కాబట్టి ఈలోగా వేరే ప్రాజెక్టుని ఓకే చేసుకునే పనిలో పడ్డాడు. ప్రస్తుతం నాని, శ్రీనిధి శెట్టి ప్రమోషన్లలో బిజీగా ఉండగా శైలేష్ హిట్ 3 చివరి దశ పనులు, ఫైనల్ కరెక్షన్లలో మునిగి తేలుతున్నాడు.ఇదిలా ఉండగా నాగార్జునకు శైలేష్ కొలను ఒక స్టోరీ చెప్పినట్టు లేటెస్ట్ అప్డేట్. ఇంకా అధికారికంగా తెలియలేదు కానీ ఒక రౌండ్ చర్చలైతే జరిగాయట. కుబేర, కూలి క్యామియోల తర్వాత నాగార్జున ఎవరికీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. తమిళ దర్శకులతో అనుకున్న ఒకటి రెండు ప్యాన్ ఇండియా మూవీస్ ని పెండిరగ్ లో ఉంచారు. అయితే శైలేష్ చెప్పిన స్టోరీ లైన్ బాగా నచ్చడంతో ఫుల్ వెర్షన్ డెవలప్ చేసుకుని రమ్మని అడిగారట. సీనియర్ స్టార్లను హ్యాండిల్ చేయడంలో తడబడిన శైలేష్ కొలను వెంకటేష్ కు సైంధవ్ రూపంలో ఫ్లాప్ ఇచ్చాడు. అందుకే ఈ టాలెంటెడ్ డాక్టర్ కి హిట్ 3 సక్సెస్ చాలా కీలకం. హిట్ 3 ఫలితం కూడా నాగ్ కాంబో కార్యరూపం దాల్చడానికి దోహదం చేయొచ్చు. నా సామిరంగా తర్వాత నాగార్జున దర్శనం జరగలేదు. ఈ ఏడాది రెండుసార్లు కనిపించబోతున్నప్పటికీ అవి స్పెషల్ రోల్స్ కావడంతో సోలోగా నాగ్ ని చూడాలని అభిమనులు ఎదురు చూస్తున్నారు. శైలేష్ ఆయనకు చెప్పిన కథ క్రైమ్ జానరేనట.





# మరోసారి చిరుకు జోడీగా నయనతార..!



మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావుపూడి కాంబినేషన్ ఓ మూవీ రాబోతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమా పూజాకార్యక్రమాలు కూడా పూర్తి చేసుకుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ రూమర్ నెట్టింట వైరల్ అవుతోంది. అదేంటంటే.. ఈ చిత్రంలో చిరు సరసన మరోసారి నయనతార నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. నయనతార తోపాటు ఇందులో బాలీవుడ్ నటి పరిణితి చోప్రా కూడా కీలక పాత్రలో నటిస్తారని సినీ వర్గాల టాక్. ఇప్పటికే నయనతార..చిరుకు జోడీగా సైరా సినిమా చేసిన విషయం తెలిసిందే. అయితే, అందులో సాంగ్స్ కు గానీ, రొమాన్స్ కు గానీ పెద్దగా స్కోప్ లేకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహపడ్డారు. ఇక, గాడ్ ఫాదర్ లో చెల్లిగా నటించినా.. ఇద్దరి మధ్య డైలాగ్స్ లేవు. ఈ క్రమంలో అనిల్ తెరకెక్కించబోయే సినిమాలో చిరు, నయన్ కలిసి నటిస్తే.. ఫ్యాన్స్ కు పండగనే చెప్పాలి. ఈ సినిమా కామెడీ, మాస్ ఎంటర్ టైనర్ గా రూపొందనుంది. ఇందులో అనిల్.. వింటేజ్ మెగాస్టార్ ను చూపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో చిరునయన్ మధ్య రోమాన్స్, సాంగ్స్ చూసి అభిమానులు ఎంజాయ్ చేసే అవకాశం ఉంది. కాగా, ఈ మూవీ షూటింగ్ త్వరలోనే ప్రారంభించనున్నారు.



# గ్లామర్ గలాటతో మళ్లీ రెచ్చిపోయిన జాన్వీ..

లాక్మే ఈవెంట్‌లో జాన్వీ కపూర్ ధరించిన బ్లాక్ డ్రెస్ ఇప్పటికీ మన మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఆ దుస్తులు ఆమె అందాన్ని, గ్రేస్‌ను, స్టైలిష్ వైభవాన్ని ఏకకాలంలో ప్రతిబింబించాయి. నిజంగా చెప్పాలంటే, ఆ మునుపటి క్షణం ఇప్పటికీ ఫ్యాషన్ ప్రేమికుల మదిలో తేలియాడుతోంది. జాన్వీ కపూర్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా చూస్తే, అది ఓ ఫ్యాషన్ మాంత్రికతగా అనిపిస్తుంది. ఆమె స్టైల్ బోల్డ్ నెస్, ఎల్గాన్స్ రెండింటినీ సమపాళ్లలో మేళవించి చూపిస్తోంది. అందుకే, ఆమెను నేటి తరం అత్యంత చర్చనీయాంశమైన ఫ్యాషన్ ఐకాన్లలో ఒకరిగా అభివర్ణించడంలో ఆశ్చర్యం లేదు. జాన్వీ వార్‌డ్‌రోబ్ అనేది ఏకధాటిగా ఒకే ముడిపెట్టిన శైలి కాదు. ప్రతిసారీ ఆమె పంచుకునే ప్రతీ లుక్, ఆమె వ్యక్తిత్వంలోని గ్రేస్‌ను ప్రతిబింబిస్తోంది. పచ్చని చీరల నుండి, గ్లామరస్ ఈవెనింగ్ గౌన్ల వరకు.. ప్రతి స్టైల్‌లోనూ ఆమె తన ప్రత్యేకతను నిలబెడుతోంది. ఆమె ఎన్నుకుంటున్న దుస్తులు బోల్డ్ అయినప్పటికీ, వాటిలో ఓ సొగసైన సున్నితత్వం ఉంటోంది. ఇది ఫ్యాషన్ అంటే ఏంటి అన్న నిర్వచనాన్ని మళ్లీ మళ్లీ తిరిగి నిర్వచిస్తున్నట్లే. ప్రతి సారి జాన్వీ బయటకు వచ్చి మెరిసేటప్పుడు, "ఐకానిక్" అనే పదానికి నిజమైన అర్ధాన్ని అర్థవంతం చేస్తోంది. ఆమె తీసుకునే ప్రతి ఫ్యాషన్ నిర్ణయం, ఆమె వ్యక్తిగత ప్రయాణాన్ని, అభివృద్ధిని ప్రతిబింబిస్తుంది. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన స్థానాన్ని సంపాదించడమే కాదు, సినిమారంగంలోనూ జాన్వీ కపూర్ తన ప్రతిభను నిరూపించుకుంటోంది. 'ధడక్' సినిమాతో జాన్వీ వెండితెరపై అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్' వంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవలే జాన్వీ తన తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టింది. ఎన్టీఆర్ హీరోగా రూపొందుతున్న 'దేవర' సినిమాలో ఆమె తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. త్వరలోనే ఆమెను 'RC16', 'దేవర 2' చిత్రాల్లో కూడా చూడబోతున్నాం. ఈ ప్రాజెక్టులు కూడా ఆమె సినీ కెరీర్‌కు మైలురాళ్లుగా నిలవబోతున్నాయని అంచనాలు ఉన్నాయి.

# 'మనల్ని ఎవడ్రా ఆపేది'



హైదరాబాద్ లో ఘనంగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ తో నాని హిట్ 3 ప్రమోషన్లను క్లైమాక్స్ కు తెచ్చేశాడు. ఆషామాషీగా ఎవరినో తీసుకొస్తే దీని రేంజ్ కు తగ్గట్టు ఉండదని భావించి ఏకంగా రాజమౌళినే ముఖ్యఅతిథిగా వచ్చేలా చేసుకున్నాడు. ఇద్దరి మధ్య ఈగ టైం నుంచి బాండిరగ్ మొదలైన సంగతి తెలిసిందే. దాని తర్వాత ఈ కాంబో మళ్ళీ సాధ్యం కానప్పటికీ నాని అంటే జక్కన్నకు ప్రత్యేక మక్కువ ఎప్పుడూ ఉంటుంది. ఈ కారణంగానే మజ్నులో ఒక చిన్న సన్నివేశంలో గెస్టుగా నిజ జీవిత పాత్రను పోషించడం అభిమానులు మర్చిపోలేరు. అందుకే నానికి జక్కన్న ఎప్పుడు వచ్చినా అంత ఆనందం కలుగుతుంది. మరోసారి ఈ వేదిక సాక్షిగా నాని హిట్ 3 మీద తన నమ్మకాన్ని బహిర్గత పరుచుకున్నాడు. తన మాటల్లోనే క్లుప్తంగా చూద్దాం. ''నా వెనుక రాజమౌళి ఉన్నారు. ముందు మీరున్నారు. కడుపులో తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదముంది. మే 1 థియేటర్లలో మీకు బెస్ట్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వడం ఖాయం. ఇక్కడ అనొచ్చో లేదో తెలియదు కానీ పవన్ కళ్యాణ్ గారి మాటల్లో చెప్పాలంటే మనల్ని ఎవడ్రా ఆపేది. కొత్త సినిమాలు రిలీజైనప్పుడు రాజమౌళి ఫ్యామిలీ ప్రీమియర్లకు వెళ్లి పంచుకునే అభిప్రాయాన్ని ఈసారి హిట్ 3 కోసం ఎదురు చూస్తున్నా. దాని కోసం ఏదైనా ప్రయాణం ప్లాన్ చేసుకుంటే జక్కన్న పాస్ పోర్ట్ లాక్కోవడానికి కూడా రెడీ'' ప్రసంగాన్ని కొనసాగిస్తూ ''హిట్ 3 లో థాంక్స్ చెప్పుకోవాల్సిన కొందరు ప్రత్యేకమైన వ్యక్తులు ఉన్నారు. కానీ వాళ్ళ గురించి సక్సెస్ మీట్ లో మాత్రమే మాట్లాడగలను. కోర్ట్ నచ్చకపోతే హిట్ 3 చూడొద్దని చెప్పా. నా జడ్జ్ మెంట్ నిజమయ్యింది. ఇప్పుడు ప్యారడైజ్ వేరే నిర్మాత కాబట్టి తాకట్టు పెట్టలేను కానీ ఎస్ఎస్ఎంబి 29 అందామంటే ఎవరూ పట్టించుకోరు.

# తుస్సుమన్న కామెడీ క్లాసిక్ రీ రిలీజ్




34 ఏళ్ళ క్రితం 1994లో విడుదలైన సినిమా అందాజ్ అప్నా అప్నా. భారీ బ్లాక్ బస్టర్ కాదు కానీ ఉన్నంతలో హిట్ ముద్ర వేసుకుని క్షేమంగా బయట పడిరది. మైనే ప్యార్ కియా, దిల్ లాంటి లవ్ స్టోరీస్ చూసిన కళ్ళతో అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్ జంట కామెడీని అప్పటి ఆడియన్స్ అంతగా రిసీవ్ చేసుకోలేకపోయారు. అందుకే 5 కోట్ల 40 లక్షల వసూళ్లతో సోసో అనిపించుకుంది అయితే తర్వాత దీనికి కల్ట్ ముద్ర దక్కింది. హోమ్ వీడియో వచ్చాక క్యాసెట్లు, డివిడిలు, యూట్యూబ్, ఓటిటిలో చూసిన జనం కడుపుబ్బా ఎంజాయ్ చేశారు. క్లాసిక్ స్టేటస్ వచ్చేసింది. దీంతో రీ రిలీజ్ చేస్తే బ్రహ్మాండమైన ఆదరణ దక్కుతుందనుకున్నారు. మొన్న శుక్రవారం మళ్ళీ విడుదలైన అందాజ్ అప్నా అప్నా వసూళ్లు తీసికట్టుగా ఉన్నాయి. మొదటిరోజు కేవలం 25 లక్షలు రాగా రెండో రోజు 30 లక్షలతో ఎదురీదుతోంది. నిర్మాణ సంస్థ చాలా ఖర్చు పెట్టి 4కె తో పాటు డాల్బీ సౌండ్ జత చేయించింది. మూడు నెలల ముందు నుంచే ప్రమోషన్లు చేశారు. సల్మాన్, అమీర్ ఇద్దరూ ప్రత్యేకమైన బైట్స్ ఇచ్చారు. దీంతో సహజంగానే జనం ఎగబడతారనుకుంటే థియేటర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇవాళ మహా అయితే ఇంకో పాతిక లక్షలు వస్తే గొప్పనేలా ఉంది. అది కూడా ముంబై లాంటి నగరాల్లో బుకింగ్స్ పర్వాలేదు కాబట్టి ఈ మాత్రం నెంబర్లు కనిపిస్తున్నాయి. చూస్తుంటే సీనియర్ స్టార్ల ఇమేజ్ రీ రిలీజుల విషయంలో ఏమంత పని చేయడం లేదు కాబోలు. సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ ఇద్దరూ డిజాస్టర్లలో ఉన్నారు. షారుఖ్ ఖాన్ ఒకపక్క రెండు బ్లాక్ బస్టర్లు ఇస్తే వీళ్ళేమో వరస ఫ్లాపులతో ఉసూరుమనిపించారు.

# ట్రెడిషనల్ లుక్‌లో మీనాక్షి

యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఇచట వాహనాలు నిలుపరాదు' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి.. అతి తక్కువ టైంలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుంది. అలాగే తన అందం, అభినయంతో ప్రేక్షకుల్లో మంచి ఫేమ్ తెచ్చుకుంది. రీసెంట్‌గా మీనాక్షి టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ మూవీలో హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ కూడా నటించారు. ప్రస్తుతం నాగ చైతన్య సరసన ఎన్‌సి-24 మూవీతో పాటు యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి సినిమాలో కూడా నటిస్తుంది. ఇదిలా ఉంటే.. ఓ పక్క సినిమాలతో బిజీ ఉన్నప్పటికీ మరోపక్క మీనాక్షి నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ తన లేటెస్ట్ ఫొటోస్‌లతో పాటు వ్యక్తిగత విషయాలను షేర్ చేస్తూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఈ భామ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది. అందులో బ్లూ కలర్ శారీ కట్టుకొని, ఒంటినిండా నగలు పెట్టుకుంది. అలాగే బ్లాక్ గాగుల్స్ పెట్టుకుని స్టైలిష్‌గా ఫొటోస్‌కు స్టిల్స్ ఇచ్చింది. ఇక వాటికి 'కొంచెం మస్తీ వస్తీ' అనే క్యాప్షన్ రాసుకొచ్చింది. దీంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. ఇక వాటిని చూసిన నెటిజన్లు సో బ్యూటిఫుల్ అని తెగ పొగిడేస్తున్నారు.



# రాజమౌళి రాజముద్ర ఎప్పుడు పడుతుంది



ఎస్ఎస్ఎంబి 29 షూటింగ్ మొదలై నెలలు గడిచి రెండు షెడ్యూల్స్ అయిపోయినా ఇప్పటిదాకా ఒక్క అప్డేట్ లేకపోవడం మహేష్ అభిమానులను డిస్ట్రబ్ చేస్తోంది. కనీసం పూజా కార్యక్రమాల వీడియో అయినా రిలీజ్ చేయాల్సిందని ఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. జక్కన్న ఎంత జాగ్రత్తగా ఉన్నాడంటే కనీసం సెల్ ఫోన్లలో తీసిన ఫోటో సైతం బయటికి రాలేదు. ఆ రోజు పూజకు హాజరైన వాళ్లకు తప్ప బయట ప్రపంచానికి ఆ తతంగం ఎలా జరిగిందో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో హిట్ 3 ది థర్డ్ కేస్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో రాజమౌళి మహేష్ మూవీ గురించి ఏమైనా మాట్లాడతాడానే ఆశలు ఫాన్స్ లో ఉన్నాయి.అయితే ఒక్కటి స్పష్టంగా గుర్తుపెట్టుకోవాలి. రాజమౌళి వస్తోంది నాని ఈవెంట్ కి. ఎట్టి పరిస్థితుల్లో వేరే టాపిక్ మీదకు డైవర్ట్ అవ్వడానికి ససేమిరా ఒప్పుకోరు. యాంకర్ ఒత్తిడి చేసినా, ఫ్యాన్స్ గోల చేసినా ఎలాంటి రియాక్షన్ ఉండదు. ఒక నవ్వు నవ్వేసి టైం వచ్చినప్పుడు చెబుతానని తప్పించుకుంటారు తప్పించి ఎలాంటి అప్డేట్ ఇవ్వరు. సో హిట్ 3 వేడుకను ఆ కోణంలో చూడకుండా నాని వైపు నుంచి మాత్రం ఎంజాయ్ చేయాలి. త్వరలో ఆఫ్రికా వెళ్ళబోతున్న ఎస్ఎస్ఎంబి 29 టీమ్ ప్రస్తుతం వీసా ఫార్మాలిటీస్ పూర్తి చేసుకునే పనిలో ఉంది. అక్కడో నెల నుంచి రెండు నెలల మధ్య చిత్రీకరణ ఉంటుందని యూనిట్ టాక్. మే 31 కృష్ణ గారి పుట్టినరోజు రాబోతున్న సందర్భంగా ఆ రోజు ఏమైనా అనౌన్స్ మెంట్ వచ్చే అవకాశం లేకపోలేదు. చిన్న టీజర్ సిద్ధమవుతోందని అంటున్నారు కానీ రాజమౌళి రాజముద్ర పడితే తప్ప అది బయటికి రాదు. లేదంటే ఏదైనా పోస్టర్ తో సర్దుకోవాల్సి రావొచ్చు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గుజరాత్‌పై రాజస్థాన్ ఘన విజయం

ఐపీఎల్ 18లో వరుసగా ఐదు ఓటముల తర్వాత రాజస్థాన్ రాయల్స్ ఎట్టకేలకు మూడో విజయం సాధించింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. అనంతరం రాజస్థాన్ 15.5 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (101: 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. 35 బంతుల్లోనే శతకం చేశాడు. ఐపీఎల్ చరిత్రలో ఇది రెండో అత్యంత వేగవంతమైన సెంచరీ. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (70*: 40 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకంతో చెలరేగాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్ చెరో వికెట్ తీశారు.

**వైభవ్ ఊచకోత..**

210 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్‌కు.. వైభవ్, జైస్వాల్ తొలి వికెట్‌కు 166 పరుగుల భాగస్వామ్యం అందించారు. ఇటీవల గెలుపుతీరాలకు వచ్చి బోల్తా పడుతున్న రాజస్థాన్.. ఈమ్యాచ్‌లో మాత్రం ఎలాంటి వణకు బెణుకు లేకుండా చెలరేగింది. తొలి ఓవర్ నుంచే ఇద్దరు బ్యాటర్లు దంచికొట్టారు. తొలి ఓవర్ మూడో బంతికి సిరాజ్ బౌలింగ్‌లో సిక్స్‌తో ఖాతా తెరిచిన వైభవ్.. నాలుగో ఓవర్లో తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ఇషాంత్ బౌలింగ్‌లో 6,6,4,0,6,4 పరుగులతో దంచికొట్టాడు. ఆ తర్వాతి ఓవర్లో జైస్వాల్ ఫోర్ కొట్టగా, సూర్యవంశీ రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ బాదాడు. దీంతో ఈ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. వైభవ్ 17 బంతుల్లోనే తన తొలి అర్ధశతకం చేశాడు. దీంతో 5 ఓవర్లు ముగిసేసరికి రాజస్థాన్ 81 పరుగులతో నిలిచింది. ప్రసిద్ధ్ వేసిన 8వ ఓవర్లో జైస్వాల్ రెండు ఫోర్లు, వైభవ్ ఒక సిక్స్ కొట్టారు. కరీమ్ జనత్ వేసిన 10 ఓవర్లలో సూర్యవంశీ ఊచకోతకోశాడు. వరుసగా 6,4,6,4,4,6 ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి రాజస్థాన్ 144 పరుగులతో నిలిచింది. ఆ తర్వాతి ఓవర్లోనే సిక్స్‌తో వైభవ్ ఐపీఎల్‌లో తన తొలి శతకం చేశాడు. ఐపీఎల్ చరిత్రలో భారత్ తరపున అత్యంత వేగంగా (35 బంతుల్లో) శతకం చేసిన వ్యక్తిగా వైభవ్ రికార్డు కెక్కాడు. వైభవ్ ఇన్నింగ్స్‌లో మొత్తం 11 సిక్స్‌లు, 7 ఫోర్లు ఉన్నాయి. తన 101 స్కోర్‌లో బౌండరీలతో వచ్చినవే 94 పరుగులు ఉన్నాయి. మరోవైపు 31 బంతుల్లో జైస్వాల్ అర్ధశతకం చేశాడు. అయితే ప్రసిద్ధ్ వేసిన 12 ఓవర్లో వైభవ్ బౌల్డ్ అయ్యాడు. ఆతర్వాత వచ్చిన నితీశ్ రాణా స్వల్ప వ్యవధిలోనే రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. అనంతరం రియాన్ పరాగ్ (32*: 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి యశస్వి రాజస్థాన్‌ను గెలుపుతీరాలకు చేర్చాడు.





**చెలరేగిన గిల్, బట్లర్..**

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్‌కు శుభ్‌మన్ గిల్ (84: 50 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (39: 30 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) తొలి వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం అందించారు. తొలుత నెమ్మదిగా ఆడిన వీరు తర్వాత చెలరేగారు. యుధ్వీర్ సింగ్ బౌలింగ్‌లో గిల్ వరుసగా రెండు ఫోర్లు బాదాడు. నాలుగో ఓవర్లో సాయి, గిల్ చెర్ బౌండరీ కొట్టి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చారు. పది ఓవర్లు ముగిసే సరికి ఆజట్టు 92 పరుగులతో నిలిచింది. ఈ క్రమంలో 29 బంతుల్లో గిల్ అర్ధశతకం చేశాడు. అయితే 11 ఓవర్లో తీక్షణ బౌలింగ్‌లో సాయి సుదర్శన్ క్యాచ్ ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన జోస్ బట్లర్ (50*: 26 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు)తో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 14వ ఓవర్లో శుభ్‌మన్ రెండు సిక్స్‌లు బాదాడు. ఆ తర్వాత హసరంగ బౌలింగ్‌లో బట్లర్ చెలరేగిపోయాడు. వరుసగా 6,6,4,6 కొట్టడంతో మొత్తం 24 పరుగులు వచ్చాయి. దీంతో 15 ఓవర్లకు గుజరాత్ 149/1 నిలిచింది. రెండు ఓవర్ల తర్వాత తీక్షణ బౌలింగ్‌లో గిల్ ఔటయ్యాడు. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో బట్లర్ రెండు సిక్స్‌లు బాదగా, వాషింగ్టన్ ఒక ఫోర్ కొట్టాడు. 19వ ఓవర్లో వాషింగ్టన్‌ను సందీప్ శర్మ ఔట్ చేశాడు. ఇక చివరి ఓవర్లో తొలి బంతికి తెవాతియా సిక్స్ బాది, తర్వాతి బంతికి ఎల్బీ అయ్యాడు. చివరి బంతికి బట్లర్ రెండు పరుగులు తీసి అర్ధ శతకం నమోదు చేశాడు.



## ఐపిఎల్ లో కోహ్లీ సరికొత్త రికార్డు..

ఐపిఎల్ చరిత్రలో కింగ్ కోహ్లీ సరికొత్త రికార్డు సృష్టించింది. నిన్న రాత్రి ఢల్లీ జట్టుతో జరిగిన మ్యాచ్ లో కోహ్లీ అర్ధ శతకంతో రాణించాడు. దీంతో ఈ సీజన్ లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్ మెన్ గా కోహ్లీ నిలిచాడు. ఇప్పటివరకు ఆడిన పది మ్యాచ్ ల్లో కోహ్లీ 443 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే ఐపిఎల్ లో అరుదైన ఘనత సాధించాడు. వరుసగా 11 ఐపిఎల్ సీజన్లలో 400కు పైగా స్కోరు చేసిన ఒకే ఒక్క ప్లేయర్ గా రికార్డు నెలకొల్పాడు. ఓ సీజన్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు కూడా కోహ్లీ(973) పేరిటే ఉంది. కాగా, ఆర్సీబీ జట్టు కూడా ఈ సీజన్ తో వరుస విజయాలతో ఊహించని విధంగా చెలరేగుతోంది. ఇప్పటివరకు ఒక ఐపిఎల్ ట్రోఫీ కూడా గెలవని భాద ఆ జట్టును వెంటాడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈసారి మాత్రం కప్పు మనదే అన్నట్లు ఆర్సీబీ.. ప్రత్యర్థులపై విరుచుకుపడుతోంది. ఆడిన 10 మ్యాచ్ లో ఏడు గెలిచి అగ్రస్థానంలో ఉంది. ఈ క్రమంలో ఆర్సీబి.. ఐపిఎల్ చరిత్రలో సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. ప్రత్యర్థుల సొంత గడ్డపై వరుసగా 6 మ్యాచ్ ల్లో విజయం సాధించిన ఒకే ఒక జట్టుగా ఆర్సీబి నిలిచింది. మ్యాచ్ విషయానికి వస్తే.. ఆదివారం ఢల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో బెంగళూరు విజయం సాధించింది. ఢల్లీ నిర్దేశించి 164 పరుగుల లక్షాన్ని కేవలం 4 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. విరాట్ కోహ్లీ(51), కృనాల్ పాండ్య(73)లు అర్ధ శతకాలతో రాణించారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన ఢల్లీ.. భువనేశ్వర్ కుమార్(3/33) బౌలింగ్ ధాటికి విలవిల్లాడిరది. భువికి తోడు హాజిల్‌వుడ్ సయితం(2/36) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నాస్టనికి 163 పరుగులు చేసింది. కెఎల్ రాహుల్(41), స్టబ్స్(34)లు మాత్రమే రాణించారు.

# ముంబై అరుదైన రికార్డు..

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఐదుసార్లు ట్రోఫీ విజేత నిలిచిన ఈ జట్టును ఎదురుకోవాలంటే.. ప్రత్యర్థు కాస్త భయపడాల్సిందే. అలాంటి ముంబై జట్టు ఈ సీజన్ ఆరంభంలో తడబడిరది. ఆడిన ఐదు మ్యాచుల్లో కేవలం ఒక మ్యాచ్‌లోనే విజయం సాధించింది. దీంతో ముంబై ఈసారి ప్లేఆఫ్స్‌కి వెళ్లడం కష్టమే అని అంతా అనుకున్నారు. కానీ, ఊహించని విధంగా ముంబై తిరిగి ఫామ్‌లోకి వచ్చిన ఆ తర్వాతి ఐదు మ్యాచ్‌లలో వరుసగా అన్నింటిలో విజయం సాధించి తమకు తామే సాటి అని నిరూపించుకుంది. ఆదివారం లక్నోపై సాధించిన విజయంతో ముంబై ఇండియన్స్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. లక్నోపై గెలుపు ఈ సీజన్‌లో ముంబైకి వరుసగా ఐదో విజయం మాత్రమే కాకుండా.. మొత్తం ఐపిఎల్ చరిత్రలో 150వ విజయం. దీంతో ఐపిఎల్‌లోనే అత్యధిక మ్యాచ్‌లలో విజయం సాధించిన జట్టుగా రికార్డు సృష్టించింది. ముంబై తర్వాతి స్థానంలో 140 మ్యాచ్‌లతో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఉంది. ఆ తర్వాత స్థానాల్లో కోల్‌కతా నైట్ రైడర్స్(134), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(129), ఢల్లీ క్యాపిటల్స్(112) ఉన్నాయి.



## మూడో స్థానంలో అరవింద్

గ్రాండ్ ప్రీ చెస్ ర్యాపిడ్ ఆరో రౌండ్ ముగిసేసరికి భారత గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం మూడో స్థానానికి దూసుకొచ్చాడు. ఆదివారం జరిగిన నాలుగో గేమ్‌లో గెలిచిన అరవింద్ ఐదు, ఆరో రౌండ్‌లను డ్రా చేసుకున్నాడు. దాంతో ఏడు పాయింట్లతో అరవింద్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడు రౌండ్లలో..రెండింటిలో పరాజయం పాలయ్యాడు. మరో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. దాంతో ప్రజ్ఞానంద (5) ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నాడు.



## పహల్గాం ఉగ్రదాడి ఘటన.. ఆ టోర్నీకి భారత్ దూరం

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లోని బైసరన్ మేడోస్‌లో జరిగిన ఉగ్రదాడి లో 28 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్ పట్ల భారత్ పలు కఠిన నిర్ణయాలు తీసుకుంది. భారత్ లో ఉన్న పాక్ పౌరులు, పర్యటకులు తక్షణమే దేశం విడిచి వెళ్లాలని హుకుం జారీ చేసింది. అట్టారి బోర్డర్ సరిహద్దును కూడా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. పాక్ కూడా ఇలాంటి నిర్ణయాలే తీసుకొని, వాటిని కఠినంగా అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో పాకిస్తాన్ లో జరగనున్న ఆసియా వాలీబాల్ చాంపియన్‌షిప్ నుంచి వైదొలగుతున్నట్లు భారత్ ప్రకటించింది. ఉగ్రదాడి నేపథ్యంలో ఇస్లామాబాద్ లో జరగనున్న ఈ టోర్నీ నుంచి తాము తప్పుకుంటున్నట్టు భారత వాలీబాల్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. భవిష్యత్తులో కూడా ఆ దేశంలో జరిగే ఏ టోర్నీలో కూడా పాల్గొనబోమని ఫెడరేషన్ తేల్చి చెప్పింది. అంతేకాదు.. అన్ని రకాల అంతర్జాతీయ క్రీడల నుంచి పాక్ ను నిషేధించాలని ప్రపంచ దేశాలను కోరింది.



# ఇలా ఒక్కరినే టార్గెట్ చేయడం సరికాదు

(IPL 2025)లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ (Rishabh Pant) ఆటగాడిగా పూర్తిగా విఫలమవుతున్నాడు. చెత్త బ్యాటింగ్‌తో విమర్శలు మూటగట్టుకుంటున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అతడు నమోదు చేసిన స్కోర్లు వరుసగా.. 0, 15, 2, 2, 21, 63, 3, 0, 4. 98.21 స్ట్రైక్‌రేటుతో మొత్తంగా కలిపి కేవలం 110 పరుగులు చేశాడు. క్యాష్ రిచ్ లీగ్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా చరిత్రకెక్కిన పంత్ నుంచి ఇలాంటి ఆట తీరు అస్సలు ఊహించనిది. దీంతో అభిమానులు సైతం అతడిపై విమర్శలు గుప్పిస్తున్నారు.

అయితే, కెప్టెన్‌గా మాత్రం రిషభ్ పంత్ ప్రదర్శన బాగానే ఉంది. అతడి సారథ్యంలో ఇప్పటి వరకు పది మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న లక్నో ఐదింట గెలిచింది. తాజాగా ఆదివారం నాటి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడి ఐదో పరాజయం నమోదు చేసింది.

ఎక్కువగా ఆలోచించకపోవడమే మంచిది

ఈ నేపథ్యంలో ఓటమి అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన రిషభ్ పంత్‌కు అతడి ఫామ్ గురించి ప్రశ్న ఎదురైంది. ఇందుకు బదులిస్తూ.. ‘‘ఈ విషయం గురించి ఎక్కువగా ఆలోచించకపోవడమే మంచిది. పరిస్థితులు మనకు అనుకూలంగా లేనపుడు మన నైపుణ్యాలపై మనకే సందేహాలు తలెత్తుతాయి. అయితే, అలాంటి భావనలను దరిచేయనీయకూడదు. జట్టు బాగా ఆడుతున్నపుడు.. ఆ విషయంపైనే ఎక్కువగా దృష్టిసారించాలి.

ఒక్కరినే టార్గెట్ చేయడం సరికాదు

క్రికెట్ అంటేనే జట్టుగా ఆడాల్సిన ఆట. అవును.. ఒక్క ఆటగాడి వల్ల కూడా ప్రభావం ఉంటుంది. మ్యాచ్ దిశ మారిపోతుంది. కానీ ప్రతిసారి ఒక్కరినే టార్గెట్ చేయడం సరికాదనుకుంటా’’ అని పంత్ ఒకింత అసహనం వ్యక్తం చేశాడు.

కాగా హార్దిక్ పాండ్యా నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఆదివారం జరిగిన పోరులో ముంబై 54 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది.



ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 58; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 54; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌటైంది.

**విల్ జాక్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో**

లక్నో ఆటగాళ్లలో ఆయుశ్ బదోని (22 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (24 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. పంత్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ వచ్చి కేవలం నాలుగు పరుగులే చేసి నిష్క్రమించాడు. విల్ జాక్స్ బౌలింగ్‌లో కర్ణ్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఈ వికెట్ కీపర్ బ్యాటర్ పెవిలియన్ చేరాడు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in